ఆంధ్రజ్యోతి

గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 30 అక్టోబరు 2025





పెదనందిపాడు: నల్లమడ వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా



తెనాలి : పొలాల్లో నేలవాలిన వరిపైరును చూపుతున్న రైతు



తెనాలి: పడిపోయిన విద్యుత్ స్తంభాలను నిలబెడుతున్న సిబ్బంది

మొంథా బీభత్సం



● జలదిగ్బంధంలో ప్రత్తిపాడు ప్రధాన రహదారి



● లాం చప్టాపై పారుతున్న కొండవీటి వాగు వరద



లంక గ్రామాల్లో నేలకొరిగిన దొండ పందిరి



కొల్లిపర: తూములూరు పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహా



చేబ్రోలు: తుఫాన్‌గాలులకు కూలిన సొరకాయ, దొండ పందిర్లు



పొన్నూరు: దొప్పలపూడి ప్రధాన రహదారిపై కూలిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు



తాడేపల్లి కరకట్ట మార్గంలో నేలకొరిగిన 70 ఏళ్లనాటి రావిచెట్టు

మొంథా ముంచేసింది.

వాతావరణశాఖ హెచ్చరించినట్లు గానే బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురిశాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి గాలుల తీవ్రత పెరుగుతూ వచ్చినా, రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వీచిన పెనుగాలులు, వర్షం బీభత్సాన్ని సృష్టించింది. కొన్ని ప్రాంతాల్లో కుండ పోత వర్షం కురిసింది. ఈదురు గాలులతో పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. భారీగా కురిసిన వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా రహదారులపై ప్రవహించాయి. పొలాలు చెరువులను తలపించాయి. చేతికి అందివచ్చిన పంటలు చాలావరకు ముంపునకు గురయ్యాయి. మంగళవారమే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించగా బుధవారం వారంతా అక్కడే ఆశ్రయం పొందారు. ఇక మునిగిన పొలాలను, పునరావాస కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. బుధవారం వర్షంలోనే ఎక్కడికక్కడ నేలకూలిన చెట్లను తొలగించి రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు. దీంతో పాటు విద్యుత్ స్తంభాలను నిలబెట్టి కరెంట్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చేశారు.

రైతుల వెన్ను విరిచిన తుఫాన్

- పలు ప్రాంతాల్లో అత్యంత భారీగా వర్షం
- రహదారులపై ఉధృతంగా ప్రవహించిన వాగులు
- గాలులకు పడిపోయిన వృక్షాలు, కరెంటు స్తంభాలు
- వర్షంలోనూ సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం
- పునరావాస కేంద్రాల్లో వందలాది కుటుంబాలకు ఆశ్రయం
- నిజాంపట్నం హార్బర్‌లో కొనసాగుతున్న 3వ ప్రమాద హెచ్చరిక

గుంటూరు, గుంటూరు సిటీ, తెనాలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పై విరుచుకుపడింది. మంగళవారం రాత్రి పెను గాలులతో బీభత్సం సృష్టించిగా.. బుధ వారం భారీ నుంచి అతిభారీగా వర్షం కురి సింది. తుఫాన్ ప్రభావంతో బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతవాసులు రాత్రంతా చిమ్మచీకట్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. మూడు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరా యం ఏర్పడింది. గాలుల ధాటికి ఖరీఫ్ రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. చేలన్నీ చాపలా నేలపై పరుచుకుపోతే, అటు లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలకు తీరని నష్టం ఏర్పడింది. గెలలుచేతికొచ్చే తరుణంలో అరటి చెట్లు విరిగిపడటంతో రైతు వెన్ను విరిగింది. తమలపాకు, బొప్పాయి, కూరగాయల తోటల రైతుల కూ భారీ నష్టం ఏర్పడింది. కంకులు వచ్చి, పచ్చని రంగులో వరి కళకళలాడుతుంటే తుఫాన్ వరి రైతు ఆశలపై నీళ్లు చల్లింది. పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ కింద వరి సాగవుతుంటే బాపట్ల జిల్లాలో 3,79,997 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 1,84,190 ఎకరాలు సాగులో ఉంది. అయితే బాపట్ల జిల్లాలో 40 శాతం, గుంటూరు జిల్లాలో 20 శాతానికిపైగా పంట దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వర్షానికంటే గాలులకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. చాపలా పరచుకున్న చేలు ఎక్కడ చూసినా పడమర నుంచి తూర్పుకు వాలిపోయి కనిపించాయి. మరికొన్ని చేలల్లో సుడిగాలులు వీచినట్లు వరి చిందరబందరగా పడిపోయింది. గింజ కూడా దక్కకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్లకు, (మిగతా 6వ పేజీలో)

జిల్లాలో 50 కి.మీ. మేర రోడ్లు ధ్వంసం

గుంటూరు,తెనాలి: తుపానుధాటికి జిల్లాలో 50 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నాయి. మూడు రోజులు కురిసిన నాన్చుడు వర్షాల కారణంగా రోడ్లు నాని, వాహనాల తాకిడికి ఉపరితలం దెబ్బతింది. జిల్లా వ్యాప్తంగా 20 రోడ్లకు నష్టం వాటిల్లగా, రెండు చోట్ల రోడ్లకు గండ్లు పడ్డా యి. 21 చోట్ల చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. తాజా అంచనాల ప్రకారం ఈ నష్టం 2 కోట్లు ఉంటుందని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. విజయవాడ నుంచి చిల కలూరిపేట వరకూ జాతీయ రహదారి ఉపరితలం దెబ్బతిని అడు గడుగునా గుంతలు పడ్డాయి. గుంటూరు నగరంలో అంతర్గత రహదా రులు ఇప్పటికే పూర్తిగా ధ్వంసమైపోయాయి.తుపాను తీవ్రత తగ్గిన తర్వాత బుధవారం ఉదయం కలెక్టర్ తమీమ్ అన్సారియా పెదనంది పాడు, కాకుమాను మండలాల్లో పర్యటించారు. ఆ సమయంలో వరగాని గ్రామం వద్ద నక్కలవాగు, మేకలవాగును దాటి అవతలికి ఆమె కారు వెళ్లలేని పరిస్థితిలో ఆమె ట్రాక్టర్‌పై వాగులు దాటి పొలాలను పరిశీలించారు.

ఎక్కడ చూసినా కన్నీళ్లు..

తుఫాను ధాటికి జిల్లాలోని పొలాలన్నీ పూర్తిగా నీట మునిగాయి. నోటి కాడికి వచ్చిన కూడు నేల పాలైందని నీట మునిగిన పంటలను చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈదురుగాలులు, వర్షాలతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. జిల్లాలోని 17 మండలాల్లో 22615 హెక్టార్లలో వరి పూర్తిగా ముంపునకు గురైంది. 140 గ్రామాల్లో 32473 మంది వరి రైతులకు అపార నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. 17348 హెక్టార్లలో పత్తి, 1508 హెక్టార్లలో మినుము పంట దెబ్బతింది. వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో చేలన్నీ చెరువుల్లామారాయి. కలెక్టర్ తమీమ్ అన్సారీయా, జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆయా మండలాల్లో నీట మునిగిన పొలాలను పరిశీలించారు. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, లంక గ్రామాల్లో కంద, తమలపాకు, బొప్పాయి వంటి వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెనుగాలులకు అరటి మొక్కలన్నీ విరిగిపడ్డాయి. దెబ్బతిన్న చేలల్లో 90 శాతం అరటి గెలలు వచ్చి మధ్య దశలో ఉన్నవే కావడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. దుగ్గిరాల ప్రాంతంలో సపోట, తెనాలి, చుండూరు, అమృతలూరు మండలాల్లో నిమ్మతోటల్లో కాయలు రాలిపోయాయి.

రేషన్ సరఫరాకు అవాంతరం

రేషన్ బియ్యం ముందుగానే అందించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు జారీచేయగా బుధవారం పలు ప్రాంతాల్లో సెల్ సిగ్నళ్లకు ఆటంకంతో అవాంతరం ఏర్పడింది. మంగళవారం ఏ ఆటంకం లేకుండా రేషన్ పంపిణీ చేశారు. అయితే బుధవారం పలు ప్రాంతాల్లో డీలర్లు ఇబ్బందులు పడ్డారు.

నేటి నుంచి పాఠశాలలు

గుంటూరు(విద్య): తుఫాన్ నేపథ్యంలో మూ డు రోజులుగా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం శాంతించింది. దీంతో గురువారం నుంచి యథావిధిగా విద్యాసంస్థలను పునః ప్రారంభించాలని అధికారులు ప్రకటించారు. అయితే పాఠశాలలు ప్రారంభించే సమయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యయులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. పాఠశాలల ఆవరణలో విద్యుత్ వైర్లు తెగిపడటం, చెట్ల కొమ్మలు విరిగిపోవడం ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బలహీనంగా ఉన్న శ్లాబుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యాశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కొన్ని పాఠశాలల ప్రాంగణాల్లో వర్షపు నీరు చేరిన నేపథ్యంలో పారిశుధ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనం విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వర్షాలు తగ్గిన తర్వాత అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై సూచనలు ఇవ్వాలని డీఈవోలు ప్రకటించారు.



స్తంభాలగరువు మున్సిపల్ స్కూల్‌లో పునరావాసులకు టిఫిన్



గుంటూరు బస్టాండ్ గ్యారేజ్‌లోకి వర్షపు నీరు



వర్షపు నీటిలో చుట్టుగుంట రైతు బజార్

ఫోన్ కాల్స్‌తో ఆరా..

హలో.. మేము ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉందికదా! మీరు సురక్షితంగా ఉన్నారా? మీ ప్రాంతం లో పునరావాస కేంద్రాలలో సక్రమంగా సేవలందుతున్నాయా? అధికారులు అంతా అందుబాటులో ఉన్నారా? మీకు ఏదైనా ఇబ్బంది అని సహాయం కోరితే వెంటనే స్పందిస్తున్నారా? అంటూ ఫోన్ కాల్స్‌తో బాధితులను ఆరాతీశారు. మరోపక్క పోలీస్ సిబ్బంది కూడా 100 నంబరు నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ కాల్స్‌తో బాధితుల రక్షణపై ప్రశ్నించారు.

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- ప్రకటించిన వైసీపీ జడ్పీటీసీలు
- ఎంపీపీలను దించుతున్నందుకు ప్రతీకారం

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా






జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఛైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, వైసీపీ జడ్పీటీసీలు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

'మేము జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ మీద అవిశ్వాసం పెట్టబోతున్నాం. అలా అని మాకు ఛైర్‌పర్సన్‌తో గొడవలు లేవు. ముప్పాళ్ల, మాచర్ల ఇతర మండలాల్లో వారికి(కూట మి) ఒక్క సీటు కూడా లేకుండానే పదవిలో ఉన్న వారిని దించేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. కిడ్నాప్‌లు చేస్తున్నారు.. కేసులు పెడుతున్నారు.. ఏమి చేయాలో అన్నీ చేస్తున్నారు. అందుకని మేము కూడా జడ్పీ ఛైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని అనుకుంటున్నాం. ఎప్పుడూ.. ఎలా అనేది మరలా చెబుతాం.' అని వైసీపీకి చెందిన రొంపిచర్ల జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తదితరులు పేర్కొన్నా రు. బుధవారం గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడిన అనంతరం వైసీపీ (మిగతా 6వ పేజీలో)



గుంటూరుకు పలు రైళ్ల పాక్షిక రద్దు

- డోర్నకల్‌లో రైలు పట్టాలపైకి వరద నీరు
- కొన్నిరైళ్లు గుంటూరు - పగడిపల్లి మార్గంలో మళ్లింపు
- పల్నాడు ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు - పగిడిపల్లి సెక్షన్‌లో.. విద్యుత్ ట్రాక్షన్ రెట్టింపు

- రూ. 188.31 కోట్ల నిధులకు ఆమోదం తెలిపిన కేంద్రం

8లో..

'కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం' విజేతలు వీరే..

గుంటూరు(తూర్పు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు మహా సభల సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన 'కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం' పోటీల విజేతలను పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ప్రకటించారు. రామ్‌శేషు (నెల్లూరు), సునీల్ (అమలాపురం), సరసి(హైదరాబాదు) విజేతలుగా నిలిచినట్టు పేర్కొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు

- తీర ప్రాంతాల్లోనూ కొనసాగుతోన్న పనులు
- సత్ఫలితాలనిచ్చిన ముందస్తు ప్రణాళికలు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్



గుంటూరులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



రేపల్లెలో సమీక్షిస్తున్న టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎక్కడికక్కడ నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను సిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుంటూరుతో పాటు పల్నాడు, బాపట్ల సర్కిల్స్ పరిధిలో ఓ అండ్ ఎం అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సక్సెస్ అయ్యారు. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయని చెప్పవచ్చు. తుఫాన్ ప్రభావంతో భారీ వృక్షాలు, విద్యుత్ పోల్స్, తీగెలు తెగిపడిపోతే వెంటనే పునరుద్ధరించేందుకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున ముందస్తు ఏర్పాట్లు చేశారు. అవసరమైన ప్రొక్లెయినర్లు, వాహనాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్‌లు, ఇతర సామగ్రిని స్టోర్స్‌లో అందుబాటులో ఉంచుకున్నారు. ఎటువంటి విపత్తులు సంభవించినా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబరు 1912తో పాటు గుంటూరు, పల్నాడు, సీఆర్‌డీఏ, బాపట్ల సర్కిల్స్‌లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు.

తెగిపడిపోయిన తీగెలు, కూలిన వృక్షాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు పెద్ద ఎత్తున వీచాయి. జిల్లా కేంద్రం గుంటూరులో పెద్దగా తుఫాన్ ప్రభావం చూపనప్పటికీ రూరల్ ప్రాంతాల్లో ముఖ్యంగా బాపట్ల సర్కిల్, పల్నాడు సర్కిల్స్‌లో ప్రభావం చూపింది. దాంతో ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, బాపట్ల, రేపల్లె, కొల్లూరు, కొల్లిపర మండలాలతో పాటు లంక గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోవడం, వృక్షాలు నేలకూలటంతో విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. అలానే పల్నాడు సర్కిల్ పరిధిలోని సత్తెనపల్లి రోడ్డు, నరసరావుపేట, ముప్పాళ్ళ మండలం, రెంటచింతల, మాచవరం వంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఇక సీఆర్డీఏ పరిధిలోనూ అక్కడక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి. క్షేత్రస్థాయిలో ఓఅండ్ఎం సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగానే విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు అధికారులు తెలియజేశారు. బాపట్ల, పల్నాడు సర్కిల్స్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు బుధవారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో టెక్నికల్ డైరక్టర్ మురళీకృష్ణ

తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ అధికారుల బృందంతో పర్యటించారు. ప్రధానంగా బాపట్ల సర్కిల్ పరిధిలోని రేపల్లె మండల పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ పునరుద్ధరణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఒక వైపు జాగ్రత్తలు పాటిస్తూనే విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా గుంటూరు నుంచి కూడా ప్రత్యేక అధికా రులను బాపట్ల సర్కిల్ పరిధిలోని లంక ప్రాంతాలకు కేటాయించారు. మొత్తానికి తుఫాన్ నష్టంపై ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.

జర్మన్‌లో ఎలక్ట్రీషియన్స్‌కు ఉద్యోగాలు

గుంటూరు, అక్టోబరు 29: జర్మనీలో ఎలక్ట్రీషియన్లకు ఉద్యోగాలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఐటీఐ, డిప్లొమా విద్యా అర్హతతో 18 నుంచి 30 ఏళ్ల మధ్య గల పురుష అభ్యర్థులు జర్మనీలో పనిచేయడానికి వచ్చే నెల 2వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

నేడు తుళ్లూరు సీఆర్డీఏలో జాబ్ మేళా

తుళ్లూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీఏ సౌజన్యంతో గురువారం ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనుంది. జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలకు గ్రామంలోని సిఆర్డిఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు లేదా శ్రీకర్ 99634 25999 నంబరుకు కాల్ చేయవచ్చు. జాబ్ మేళాలో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నైపుణ్యం పోర్టల్ నమోదు చేసుకోవాలని సీఆర్డీఏ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

రాజధాని రైతుల ప్లాట్లపై అసత్యప్రచారం

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్లపై కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి సచివాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. నాలుగు నెలల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా పూర్తి చేస్తామన్నారు. ఇప్పటి వరకు 29644 మంది రైతులకు సంబంధించిన 34192.19 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. ఇంకా 991 మంది రైతులకు 719.04 ఎకరాలకు ప్లాట్ల కేటాయించాల్సి ఉందన్నారు. 69421 ప్లాట్లకు 60980 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. 2501 మంది రైతులకు 8441 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. వీటిలో కోర్టు కేసుల్లో 70 మంది రైతులకు చెందిన 312 ప్లాట్లు, ల్యాండ్ ఎక్విజిషన్ పెండింగ్ ప్రాంతంలో 254 మంది రైతులకు చెందినవి 1170 ప్లాట్లు, వివాదాల్లో 450 మందికి చెందినవి 1889 ప్లాట్లు, పీవోటీ కేసుల్లో 78 మంది రైతులుకు చెందినవి 208 మంది ప్లాట్లు, దేవదాయశాఖ వివాదంలో 32 మంది రైతులకు చెందినవి 69 ప్లాట్లు, లంక అసైన్డ్ భూములు 170 మంది రైతులకు చెందినవి 337 ప్లాట్లు, ఎన్ఆర్ఐలు 210 మందికి చెందినవి 444 ప్లాట్లు ఉన్నాయన్నారు.

మొంథా బీభత్సం

(5వ పేజీ తరువాయి)

వాగులకు దగ్గరా ఉన్న చేలల్లో అయితే నేలవాలిన వరిపై నుంచి నీరు ప్రవహించింది. దీంతో పొలాల్లోని నీటిని బయటకు తియ్యడానికి రైతులు అవస్థలు పడుతున్నారు.

అప్రమత్తంగా యంత్రాంగం

ఓ పక్క తుఫాన్ ధాటికి పెనుగాలులు విరుచుకుపడుతుంటే, మరోపక్క చిమ్మచీకటి. వర్షం.. అయినా రోడ్లకు అడ్డుగా విరిగిపడిన చెట్లు, విద్యుత్తు లు స్తంభాలను తొలగించేందుకు శతవిధాలా ప్రయత్నం చేశారు. చెట్లను పడినట్టే క్షణాల్లో కత్తిరించి పక్కకు తొలగించేశారు. విద్యుత్తు స్తంభాలను పక్కకు నెట్టేసి, అవకాశం ఉన్న వరకు తెగిన తీగలను సరిచేస్తూ రాత్రంతా శ్రమించారు. మరోపక్క పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరాతో పాటు భోజనం, అల్పాహారం అందించారు. ఆరోగ్య సిబ్బంది ఎక్కడికక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందించారు. విద్యుత్ శాఖ ముందే చెట్లను నరికేయడంతో చాలావరకు నష్టం తప్పింది. ప్రధాన లైన్లు దెబ్బతినడంతో లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు 24 గంటల సమయం పట్టింది. నిజాంపట్నం హార్బర్‌లో మంగళవారం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు 8వ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. బుధవారం ఉదయం నుంచి తుపాన్ తీవ్రత తగ్గడం, గాలులు శాంతించాయి. దీంతో హార్బర్‌లో హెచ్చరిక తీవ్రతను తగ్గించారు. అయితే బుధవారం సాయంత్రం వరకు కూడా కొన్నిచోట్ల చిరుగాలులు, వర్షం కొనసాగుతుండటం, వాతారణంలో పూర్తిగా మార్పులు రాకపోవడంతో తిరిగి 3వ ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

(5వ పేజీ తరువాయి)

జడ్పీటీసీలు విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్న కారణంగా ప్రతీకారం తీర్చుకునేందుకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రతిపాదించ బోతున్నట్లు వెల్లడించారు. తమకు 42 మంది సభ్యుల మద్దతు ఉందని ప్రకటించారు. పదవీ కాలం కేవలం 11 నెలలు మాత్రమే ఉందని, అంత తక్కువ సమయంలో పదవి మారినా..తాము ఏమీ చేయలేమన్న సంగతి కూడా తెలుసు నని వారు పేర్కొనడం గమనార్హం.

అంతా బాగుంటే కలెక్టర్‌ను కలవాలని

మొంథా తుపాను కారణంగా వైసీపీ జడ్పీటీసీల వ్యూహం దెబ్బ తిన్నట్లు తెలుస్తోంది. వాతావరణం బాగుంటే.. సర్వసభ్య సమావేశం ముగిసిన తర్వాత వైసీపీ జడ్పీటీసీలు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన లేఖను అందజేయాలని ఆలోచన చేశారు. ఈ విషయాన్ని కొద్దిరోజుల క్రితమే కొందరు లీక్ చేశారు. తుపాను ఆటంకంతో వైసీపీ జడ్పీటీసీల ప్రణాళిక పారలేదు. జడ్పీలో 54 మంది జడ్పీటీసీలున్నారు. ఎన్నికలకు ముందు 12 మంది సభ్యులు టీడీపీలో చేరారు. ఒక వేళ చైర్‌పర్సన్ మీద అవిశ్వాసం ప్రతిపాదించాలంటే రెండింట మూడోంతుల మంది సంతకాలు చేయాలి. వైసీపీ జడ్పీటీసీలు చెబుతున్నట్లుగా గతంలో 42 మంది మద్దతు ఉండేది కానీ, ఈ మధ్య పూర్తి స్థాయిలో చీలికలు ఏర్పడినట్లు తెలుస్తోంది. మరో 15 మంది సభ్యులు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీ చెబుతున్నట్లు అవిశ్వాసం సంగతి మొదలు పెట్టకుండానే నవ్వులు పాలు కావచ్చన్న ప్రచారం బలంగా జరుగుతోంది. సర్వసభ్య సమావేశంపై తుఫాన్ ప్రభావం పడింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ఆరంభం కాగా ఆ సమయానికి రొంపిచర్ల జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి ఒక్కరే హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు తాటికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, బొల్లాపల్లి, పెదనందిపాడు జడ్పీటీసీలు మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా వేశారు.

పెరుగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల, మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 96,490 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా, అంతేనీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 10.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతోందన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


తుఫాన్ ప్రభావంపై ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ కమిషనర్లు

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేశారు

- తుఫాన్ ప్రభావం వల్ల ఆస్తి, ప్రాణనష్టం జరగలేదు
- నగర మేయర్ రవీంద్ర

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను సమర్థవం తంగా ఎదుర్కొన్నామని, నగరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు ప్రణా ళికాబద్ధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూశామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. బుధ వారం మేయర్, కమిషనర్‌లు రామాంజనేయపేట, ఇన్నర్‌రింగ్‌రోడ్డు, శ్రీకృష్ణదేవరాయ నగర్, తుఫాన్‌నగర్‌లను పరిశీలించి, తుఫాన్ ప్రభావంపై ప్రజలను వివరాలు అడిగి తెలుసుకొని, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తుఫాన్‌ని ఎదుర్కోవడానికి జీఎంసీ ఆధ్వర్యంలో విస్తృత చర్యలు తీసుకున్నామన్నారు. పునరావాస కేంద్రాల్లో కూడా ఏ లోపం లేకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించారన్నారు.

ప్రణాళిక బద్ధంగా చర్యలు

తుఫాను వల్ల గుంటూరు నగర ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రణా ళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపా రు. బుధవారం బుడంపాడులో నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మేయర్ నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, కార్పొరేటర్లు దాసరి లక్ష్మీ దుర్గ, జనసేన నాయ కులు దాసరి వాసు, నోడల్ అధికారులు, ప్రజారోగ్య, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, మెడి కల్ అధికారులు సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ముందస్తుగా కచ్చా డ్రెయిన్ల ఏర్పాటు, మేజర్ డ్రెయిన్లలో పూడికతీత చేపట్టడం వల్ల పలు కాలనీలు ముంపు బారిన పడలేదన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు పంపి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించామన్నారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా జీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్ 0863-2345103కి సమాచారం ఇవ్వాలని సూచించారు. అన్నక్యాంటీన్ల పరిసరాల శుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ అక్షయ పాత్ర సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మిర్చియార్డ్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని కమి షనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

డ్రెయిన్ ఆక్రమణ నిర్మాణాలపై కమిషనర్ ఆగ్రహం

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టాభిపురం మెయిన్ రోడ్‌లో జీఎంసీ స్థలం, డ్రైన్ ఆక్రమణ చేసి నిర్మాణం చేయడంపై పట్టణ ప్రణాళిక అధికారులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత టీపీబీవో, పట్టణ ప్రణాళిక కార్యదర్శిని విధుల నుంచి సస్పెం డ్ చేయాలని ఆదేశించారు. బుధవారం పట్టాభిపురం మెయిన్ రోడ్ పూజి త స్కూల్ ఎదురు జీఎంసీ స్థల ఆక్రమణ, అనధికార నిర్మాణం చేస్తున్న నిర్మాణాన్ని కమిషనర్ స్వయంగా వెళ్లి పనులను ఆపి జీఎంసీ స్థలం హద్దుగా డ్రెయిన్‌ను తవ్వించారు. అనంతరం చుట్టగుంట సెంటర్‌లోని మురికిపేట దగ్గర వర్షం నీరు నిలిచి ఉండడం పరిశీలించి, నీటిని ఇంజిన్‌లు ఏర్పాటు చేసి తోడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

నగరంలో ఒరిగిన 79 చెట్లు తొలగింపు

మొంథా తుఫాన్ ప్రభావంతో గుంటూరు నగరంలో 90 చెట్లు పడ్డాయని వాటిలో 79 చెట్లను యుద్ధప్రాతిపదికన జీఎంసీ హార్టికల్చర్ సిబ్బంది తొలగించారని కమిషనర్ తెలిపారు. నగరంలో ఎక్కడైనా చెట్లు పడిపోయినట్లు గుర్తిస్తే జీఎంసీ కంట్రోల్ రూమ్ 0863 2345103కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.


బ్రోచర్లను విడుదల చేస్తున్న డాక్టర్ విజయ

గోల్డెన్ అవర్‌లో చికిత్సతో చక్కటి ఫలితాలు

- న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పక్షవాత రోగులను మొదటి నాలుగున్నర గంటల్లో థ్రాంబోలైటిక్ థెరపీ ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని లలితా హాస్పిటల్ న్యూరో సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ పి.విజయ తెలిపారు. ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహించిన పక్షవాతం అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. పక్షవాతం విషయంలో ప్రతి నిమిషం విలువైందని అన్నారు. పక్షవాతం ప్రారంభమైన ప్రతి నిమిషానికి సుమారు 20 లక్షల మెదడు కణాలు చనిపోతాయని, గంటలో మూడు సంవత్సరాల వయసు పెరిగినంత నష్టం మెదడుకు జరుగుతుందన్నారు. ఆసుపత్రికి తీసుకెళ్లడంలో ఆలస్యం చేస్తే మెదడు నష్టం పెరిగి, శాశ్వత అంగవైకల్యం సంభవించొచ్చన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రోగులను వెంటనే చికిత్సకు తేవాలన్నారు. సమావేశంలో ఆసుపత్రి న్యూరో ఫ్యాకల్టీ డాక్టర్ యూ.వీరమ్మ, డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్ రేష్మ, డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ అజ్మా, సిబ్బంది, పాల్గొన్నారు. ఈ సందర్భంగా పక్షవాతంపై అవగాహన కల్పించే బ్రోచర్లను డాక్టర్ విజయ ఆవిష్కరించి రోగులకు, వారి సహాయకులకు అందజేశారు.

ఏపీ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయంతో గుంటూరు బ్రాడీపేటలోని కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రక్తదానం సేవా కార్యక్రమమని అన్నారు. సేవాభావం ఉన్న చోట అవినీతికి చోటు లేదని పేర్కొన్నారు. ఇలాంటి సేవలు మెరుగైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని తెలిపారు. బ్యాంక్ విజిలెన్స్ ఇన్‌చార్జీ హరీష్ బేతా మాట్లాడుతూ, రక్తదానం ప్రాణాలను కాపాడటమే కాక శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పునరుజ్జీవనం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీలు డి.శంకర్‌రావు, ఎం.అరుణ్‌కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ రామచంద్ర రాజు, బ్యాంక్ మేనేజ్మెంట్ సిబ్బంది, తదితరులున్నారు.



రక్తదానం చేస్తున్న చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

నగరం జలమయం

- తుఫాన్ ప్రభావంతో అంతా అస్తవ్యస్తం
- ఆర్టీసీ బస్టాండ్‌లో ఎక్కడి బస్సులు అక్కడే
- హైవేపై నిలిచిపోయిన లారీలు
- 74 పునరావాస కేంద్రాలలో 1884 మంది నిర్వాసితులు


పాత గుంటూరులోని వీధిలో వర్షపు నీరు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాలకు నగర జీవనం అస్తవ్యస్తమైంది. వర్షాలకు నగరంలోని పల్లపు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి పారుదల లేక ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ఆర్టీసీ బస్టాండు, సివిల్ సప్లై గెడ్డింగ్, పాత గుంటూరులోని అనేక పల్లపు, లోతట్టు ప్రాంతాలు, ఏటి అగ్రహారం, కొండా వెంకటప్పయ్య కాలనీ, అంబేడ్కర్ నగర్, సుగాలి కాలనీ, లాలిపురం రోడ్డు, జాతీయ రహదారిపై సైడ్ అప్రోచ్ రోడ్డు, సీతమ్మ కాలనీ ఇలా అనేక కాలనీలలో వర్షపు నీరు చేరి రాక పోకలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. తుఫాన్ ప్రభావంతో నగరంలో అన్ని దుకాణాలు మూసివేయించారు. కేవలం నిత్యావసర సరుకులు, పాలు, మెడికల్ షాపులు మినహా మిగతా అన్ని రకాల వ్యాపార సముదాయాలను నిలిపేశారు జీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 74 పునరావాస కేంద్రాలలో 1884 మంది నిరాశ్రయుల ఆశ్రయం పొందుతున్నారు. ఇందుకు గాను ముగ్గురు డీసీలు బొల్లినేని శ్రీనివాసరావు, వెంకటకృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాసరావు ప్రత్యేక అధికారులుగా నియమించారు. వీరి కింద 74 మంది నోడల్ అధికారులను నియమించారు. వీరంతా వారి కేటాయించిన పునరావస కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో ముందస్తు చర్యలో భాగంగా ఆర్టీసీ అధికారులు కొన్ని సర్వీసులకు సంబంధించి బస్సులు నిలిపివేశారు, అదేవిధంగా హైవేపై లారీలు కూడా తిరగకుండా పోలీసులు నిలిపివేశారు. దీంతో రెండు రోజులుగా జాతీయ రహదారి బోసిపోయింది.


ఏటీ అగ్రహారం 15వ లైన్‌లో వర్షపు నీరు


శాంతినగర్‌లో వర్షపు నీరు


కేవీపీ కాలనీ ఎదురు లైన్‌లో...

తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొన్న యంత్రాంగం

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ విపత్తును జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కొంది. పెనువిపత్తు తలెత్తుతుందని అంచనా వేసి అందుకు తగిన విధంగా పక్కా ప్రణాళిక ప్రకారం ముందస్తు ఏర్పాట్లు చేసింది. ప్రతి మండలం, మున్సిపాలిటీకీ ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు కేటాయించింది. జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, రెవెన్యూ డివిజనల్ అధికారి మండల ప్రత్యేక అధికారులు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అధికారులకు సూచనలు అందజేశారు. ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించి అప్రమత్తం చేశారు. మంగళగిరి మండలం కొత్తపేట ప్రాంతంలో కలెక్టర్ ప్రత్యేకంగా పర్యటించారు. ఆ ప్రాంతం కొండ దిగువన ఉండటం వల్ల కొండ చరియలు, బండ రాళ్లు పడే అవకాశం ఉండటంతో వాళ్లందరిని ఒప్పించి పునరావాస కేంద్రాలకు సోమవారం ఉదయమే తరలించారు. తుపానుకు జిల్లాలో 153 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి తొమ్మిది వేల మందిని తరలించారు. ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో సిబ్బందిని క్షేత్రస్థాయిలో డ్యూటీలు వేసి అక్కడి నుంచే పర్యవేక్షించారు. అధికారులు పూర్తిస్థాయిలో అన్ని చర్యలు చేపట్టడంతో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. మరోవైపు పునరావాస కేంద్రాల్లో ఉన్న 9 వేల మందికి నిత్యావసర సరుకుల పంపిణీకి కిట్లను సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నగదును కూడా అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 23 విద్యుత్ సబ్‌స్టేషన్లు మరమ్మతులకు గురికాగా వాటిని పునరుద్ధరించారు.

రేయింబవళ్లు శ్రమించిన పోలీసులు

- డ్రోన్‌తో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల నిరంతర పర్యవేక్షణ

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ప్రజారక్షణలో పోలీసులు రేయింబవళ్లు శ్రమించారు. తుఫాన్ తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నేతృత్వంలో జిల్లావ్యాప్తంగా పోలీసుశాఖ అప్రమత్తంగా విధులు నిర్వహించింది. ముఖ్యంగా తుఫాన్ ప్రభావిత లోతట్టు ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది కంటిమీద కునుకు లేకుండా విధులు నిర్వహించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. డ్రోన్ కెమెరాలతో వరద ఉధృతి, తుఫాన్ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను గమనిస్తూ ఉన్నతాధికారులను అప్రమత్తం చేస్తూ వచ్చారు. ఈదురు గాలులకు నేలకూలిన వృక్షాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. కంటి మీద కునుకు లేకుండా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మరోవైపు వాగులు, వంకలు వద్ద ఎటువంటి ప్రమా దాలు సంభవించకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. మందస్తు హెచ్చరికలతో ప్రజలను అప్రమత్తం చేస్తూ వారిని అటువైపు రాకుండా చర్యలు తీసుకున్నారు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకపోవడం, ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకపోవడంతో పోలీస్ అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు పునరావాస ప్రాంతాల్లో తలదాచుకున్న బాధితులకు సహాయక చర్యలు కొనసాగించారు. తుఫాన్ తీవ్రత తగ్గినప్పటికీ వరద ఉధృతి నేపథ్యంలో ప్రజలెవరూ వాగులు, వంకలు, చెరువులు, కాలువలు, నదుల సమీపానికి వెళ్ళవద్దని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.


రోడ్డుపై కూలిన భారీ వృక్షాన్ని తొలగించేందుకు సహాయక చర్యలు తీసుకుంటున్న పోలీసులు

నూతన భవన సముదాయానికి రూ. 6 లక్షల విరాళం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికయ్యే ఖర్చు రూ. 6 లక్షలను పద్మాలయ కన్‌స్ట్రక్షన్స్ అధినేతలు నాయుడు శ్రీనివాస్, పద్మావతి ప్రకటించారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ బాలికల వసతి గృహంలో కమ్మ జన సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరికి ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి అందిస్తున్న సహాయ, సహకారాలతో భవనాన్ని త్వరితగతిన పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అనంతరం దాతలను సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చుక్కపల్లి రమేశ్, కోశాధికారి కావూరి రవిచంద్ర, పట్టాభి సీతారామరావు పాల్గొన్నారు.


నాయుడు శ్రీనివాస్, పద్మావతిని సత్కరిస్తున్న కమ్మ జన సేవా సమితి సభ్యులు

ముంపు ప్రాంతాలను సందర్శించిన సీపీఎం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ముంపు ప్రాంతాలైన పాత గుంటూరు రాజీవ్ గాంధీ గ్రంథాలయం రోడ్డు, జున్ను షాహిద్ నగర్, శ్రామిక నగర్ కాలనీలో సీపీఎం నాయకులు సందర్శించి, ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు లక్కా అరుణ కుమారి మాట్లాడుతూ, తుఫాన్ ఇబ్బందుల నేపథ్యంలో సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. సత్యనారాయణ, వలీ, షహీద్, బాషా, టి. శ్రీనివాసరావు, శనగపల్లి కార్తీక్, సైదా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏక్తా ర్యాలీని జయప్రదం చేయండి: బీజేపీ

గుంటూరు (తూర్పు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా 31న జరిగే ఏక్తా ర్యాలీని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పిలుపునిచ్చారు. లాలుపురంలో వాజ్‌పేయి భవనంలో బుధవారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ర్యాలీ ఉదయం 8 గంటల 30 నిమిషాలకు కలెక్టరేట్ వద్ద ప్రారంభమై ప్రభుత్వ మహిళా కళాశాల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జోనల్ ఇన్‌చార్జీ నాగోతు రమేశ్ పాల్గొంటారని చెప్పారు. ర్యాలీలో కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతనిధులు, అధికారులు, కార్యకర్తలు, యువత పాల్గొనాలని కోరారు. మండల కేంద్రాల్లోనూ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాండురంగ విఠల్, బజరంగ్ రామకృష్ణ, సుబ్బారావు, చరకా కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బిలియర్డ్స్ పోటీలు

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ఆవరణలో జరుగుతున్న ఏపీ స్టేట్ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పోటీలు హోరాహోరీగా జరుగుతన్నాయి. బుధవారం 7వ రోజు ముగిసిన స్నూకర్ పోటీలలో ఎస్ శంకర్, సమీర్‌ఖాన్, చంద్రశేఖర్, సూర్య ప్రకాష్ ముందంజలో ఉన్నారని పోటీల నిర్వాహ కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్) తెలిపారు. సమీర్ ఖాన్.. టి.పూర్ణపై 3-1 తేడాతో, వి.చంద్రశేఖర్.. జి.అఖిల్‌పై 3-0 తేడాతో, జుబేర్.. శివ శంకర్‌పై 3-1 తేడాతో, సూర్య ప్రకాష్.. రవికిరణ్‌పై 3-0 స్కోర్ తేడాతో గెలుపొందారని చెప్పారు. అలాగే సుశీల్, హరికృష్ణపై 3-1, సాగర్, ప్రవీణ్‌పై 3-0, ఎస్ రమాకాంత్, వై.సతీష్‌పై 3-0, కేఎస్ రావు నిశాంత్‌పై 3-0, నవ షరీఫ్, ఇమ్రాన్‌పై 3-0, సాయిరాం, భార్గవ్‌పై 3-0, ఎస్ శంకర్రావు జునైద్‌పై 3-0, ఎండి నిమిత్, సైదాపై 3-0, నజీర్, సయ్యద్‌పై 3-1 స్కోర్ తేడాతో గెలుపొందారని అజార్ తెలిపారు.

బాధితులను జాబితాలో చేర్చాలని ఎగబడిన జనం

- గొడవకు దిగడంతో రంగంలోకి దిగిన పట్టాభిపురం పోలీసులు

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పునరవాస బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించడంతో తమ పేర్లు కూడా జాబితాలో చేర్చాలంటూ అనేకమంది ఎగబడిన ఘటన బుధవారం స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి, పుల్లయ్య మున్సి పల్ హైస్కూల్లో జరిగింది. ముంపు ప్రాంతాల్లోని బాధితులను ముందుగానే గుర్తించి పున రావాస కేంద్రానికి తరలించారు. మూడు రోజులుగా బాధితులు పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్నారు. అయితే పునరావస్ కేంద్రాల్లో ఉంటున్న బాధితులకు ప్రభుత్వం బుధవారం ఆర్థిక సాయం ప్రకటించింది. దీంతో జనం ఒక్కసారిగా పునరావాస తుఫాను బాధితుల జాబితాలో పేరు కోసం ఎగబడ్డారు. పునరావాస కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న సచి వాలయాల సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారు. అందుకు వారు ససేమిరా అనడంతో వారిపై గొడవపడ్డారు. సమాచారం అందుకున్న పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు సిబ్బంది తో హుటాహుటిన పునరావాస కేంద్రానికి చేరుకొని జాబితాలో పేర్ల కోసం ఎగపడుతున్న వారిని అదుపు చేసి అక్కడ నుంచి పంపించారు.

ఆటోలో పురుగుల మందు డబ్బా మరిచిన రైతు

- సాంకేతిక సాయంతో తిరిగి అప్పగించిన పోలీసులు

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ ఓ యువరైతు పురుగుల మందు డబ్బాల పెట్టెను అందులోనే మరచి దిగిపోయాడు. అరండల్‌పేట పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించి తిరిగి వాటిని రైతుకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు, ప్రకాశం జిల్లా దొనకొండ మండలం తెల్లచెరువు గ్రామానికి చెందిన యువ రైతు పత్తి ఆంజనేయులు లాలాపేటలోని ఒక పురుగుమందుల షాపులో మందులు కొనుగోలు చేశాడు. వేరే పని నిమిత్తం ఆటోలో బ్రాడీపేటకు వెళ్లాడు. ఈ క్రమంలో సుమారు రూ.40 వేల విలువైన పురుగుమందుల పెట్టెను ఆటోలో మరచిపోయి దిగిపోయాడు. తేరుకొని వెంటనే అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ ఆరోగ్య రాజు వెంటనే స్పందించి సీసీ కెమెరాల ఆధారంతో ఆటోను గుర్తించారు. పోగొట్టుకున్న పెట్టెను యువ రైతుకు సురక్షితంగా అప్పగించారు.



కంట్రోల్ రూము నుంచి పరిస్థితులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే నసీర్

సమష్టి కృషితో మొంథాను అధిగమించాం

- తూర్పు ఎమ్మెల్యే నసీర్
- కార్పొరేషన్ కంట్రోల్ రూము నుంచి పర్యవేక్షణ

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అధికారులు, కూటమి శ్రేణుల సమష్టి కృషితోనే మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా అధిగమించగలిగామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మొంథా తుఫాన్ ప్రభావం, ప్రజల సంరక్షణపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. మంగళవారం రాత్రి 11:30 గంటలకు తన కార్యాలయంలో కార్పొరేటర్లు, కూటమి నాయకులతో కలిసి సమీక్షించారు. వార్డుల్లో పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీశారు. రాత్రి 2 గంటల వరకు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని తుఫాన్ ప్రభావాన్ని పర్యవేక్షించిన ఎమ్మెల్యే నసీర్, రాత్రి 2:30 గంటల వరకు మున్సిపల్ కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ రూము వద్దకు వెళ్లారు. తెల్లవారే వరకు కంట్రోల్ రూము నుంచే అధికార యంత్రాంగంతో మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావంపై ఆరా తీశారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గిపోయే వరకు ప్రజలకు రక్షణగా నిలుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు.

● పునరావాస కేంద్రం పరిశీలన

తుఫాన్ కారణంగా పొన్నూరు రోడ్డులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని నసీర్ బుధవారం పరిశీలించారు. తుఫాన్ ప్రభావం తగ్గినప్పటికీ పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతిఒక్కరినీ సురక్షితంగా ఇంటికి చేర్చే వరకు వెన్నంటే నిలుస్తున్నామని తెలిపారు. తుఫాన్‌కు దెబ్బతిన్న ప్రాంతాల్లో తిరిగి యుద్ధప్రాతిపదికన సాధారణ పరిస్థితులు తీసుకొస్తామని వెల్లడించారు. ప్రజల కోసం పనిచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికార యంత్రాంగానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

'మొంథా'ను సమన్వయంతో ఎదుర్కొన్నాం

- పశ్చిమ ఎమ్మెల్యే మాధవి
- తుఫాన్ ప్రభావిత ప్రాంతాలపై ఎమ్మెల్యే నిరంతర సమీక్ష


హెల్ప్‌లైన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అధికా రులు, కూటమి శ్రేణులు, ప్రజలు సమన్వయంతో పనిచేయడం వల్ల మొంథా తుఫాన్‌ను సమర్థ వంతంగా ఎదుర్కోగలిగామని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గం లోని అన్ని డివిజన్లకు సంబంధించిన తుఫాన్ ప్రభావిత పరిస్థి తులు, పునరా వాస కేంద్రాల్లో ప్రజలకు అందు తున్న సౌకర్యాల వివరాలను మాధవి నిరంతరం సమీక్షించారు. మంగళవారం రాత్రి నుంచి తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యా దును స్వయంగా పర్యవేక్షిస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు గళ్ళా మాధవి ఆదేశాలు జారీ చేశారు. విరిగిన చెట్ల తొలగింపు, విద్యుత్ లోపాల సవరణ, పునరుద్ధరణ పనులు వేగవంతంగా చేపట్టాలని విద్యు త్ శాఖ అధికారులకు ఆమె సూచించారు. గుంటూరు మిర్చి యార్డు, స్తంబాల గరువు పుల్లయ్య మున్సిపల్ హైస్కూల్, చిన్మయ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను అధికారులు, ఎన్డీయే కూటమి నేతలతో పర్యవేక్షించారు. కృష్ణానగర్ రైతు బజార్‌లో నీరు నిలిచిపోవడంతో తక్ష ణం స్పందించి డస్ట్ వేయించి ప్రజల ఇబ్బందులను నివారించారు. పీకలవాగు కట్ట ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలకు పునరావాసం కల్పించి, సచివాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 67 మందికి భోజనం, తాగునీరు, వైద్య వసతులు అందజేశారు. పీకల వాగు ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న చెట్లను తొలగింపును డివిజన్ అధ్యక్షు డు తెల్లగొర్ల అప్పారావు యాదవ్ పర్యవేక్షించారు. ఎస్వీఎన్ కాలనీ, శ్రీనివాస రావుపేటలో కూలిన భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గంటల వ్యవధిలోనే తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

తుఫాన్ బాధితులకు మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి పరామర్శ


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్న కుటుం బాలను ఏపీసీసీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తా న్‌వలి పరామ ర్శించారు. తుఫాన్ ప్రభావిత పర్యటనలో భాగంగా ఆయన బుధవారం మద్దిరా లకాలనీలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ళలోకి వర్షపు నీరు వస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవట్లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో కాంగ్రెస్ నాయకులు మోషే, కరిముల్లా, రెహమాన్, సలాం తదితరులున్నారు.

అప్పుల వేధింపులతోనే శేషమ్మ ఆత్మహత్య

- నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు
- టీడీపీ నాయకుడికి సంబంధం లేదు
- సౌత్ ఇన్‌చార్జి డీఎస్పీ అరవింద్

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన ఈపూరి శేషమ్మ(44) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని సౌత్ ఇన్‌చార్జ్ డీఎస్పీ అరవింద్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఆయన నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఈ కేసుకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను వివరించారు. పురుగుల మందు తాగుతూ తన ఆత్మహత్యకు కారణాలు వెల్లడిస్తూ ఆమె తీసుకున్న సెల్ఫీ వీడియోలో బాధతురాలి తడబాటును ఆసరాగా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. వైసీపీకి చెందిన కృష్ణవేణి పాలేటి, శ్యామల రెడ్డి వైసీపీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా కులాలు, పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఈపూరి శేషమ్మ మరణానికి టీడీపీ గుంటూరు పార్లమెంటు అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అనుచరుడు కల్లూరి శ్రీను కారణమని.. వైసీపీ కేడర్ వివిధ ప్రచార మాధ్యమాల్లో షేర్ చేసిందన్నారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునే కంగారులో మృతురాలు శేషమ్మ సెల్ఫీ వీడియోలో తడబడిందన్నారు. శ్రీరామశెట్టి పద్మ, సీత (పద్మ చెల్లెలు), పద్మ పెద్ద కుమారుడు, ఈపూరి రమేష్, పుట్ట జానీ కోడలు జాన్ బీ, కర్లపూడి శ్రీను అనే వారు తన మరణానికి కారణమని ఆ వీడియోలో ఆమె ఆరోపించిందన్నారు. సెల్ఫీ వీడియోలో మృతురాలు ఒక సమయంలో కల్లూరి శ్రీను పేరును ప్రస్తావించగా, ఆమె స్వయంగా కర్లపూడి శ్రీను అని పేరును సరిదిద్దుకున్నట్లు కూడా గమనించినట్లు చెప్పారు. వీడియోలోని మరొక భాగంలో పద్మ అక్క అని పేర్కొని తనకుతానుగా 'చెల్లి' అని సరిదిద్దుకుందని చెప్పారు. ఇలా తడబడిన అంశాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ కేడర్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. కల్లూరి శ్రీనుకు ఈ కేసుతో ఎటువంటి సంబంధం లేదని స్పష్టంగా నిర్ధారించబడిందన్నారు. ప్రాథమికంగా కేసు నమోదైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కేసు నల్లపాడు పోలీస్‌స్టేషన్ దర్యాప్తు అధికారికి ఉత్తర్వులు ఇచ్చినట్లు డీఎస్పీ అరవింద్ తెలిపారు.


బాపట్ల రోడ్డుపై చెట్లను తొలగించిన సీఐ హరికృష్ణ, తహసీల్దారు


చిన్నచెరువు ఉప్పొంగి ప్రత్తిపాడులో నీట మునిగిన ప్రధాన రోడ్డు


నాదెండ్ల: ఎండుగంపాలెం పునరావాస కేంద్రంలో బాధితులు


బాపట్ల: మిర్చి పంటను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న పల్నాడు కలెక్టర్

మొత్త మొంథా అలజడి


గుంటూరులో విద్యుత్ వైర్లను సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

మొంథా తుపాను తీరం దాటే సమయంలో ఉమ్మడి జిల్లా మొత్తం అలజడి సృష్టించింది. భారీ ఈదురు గాలులకు రోడ్లపై చెట్లు నేలకూలాయి. వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వరి, పత్తి, కంద ఇతర పంటలు పూర్తి ముంపునకు గురయ్యాయి. పట్టణ, పల్లె ప్రాంతాల రోడ్లు జలమయమై.. చెరువులను తలపించాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అధికారుల హెచ్చరికలు లెక్కచేయకుండా.. కొంతమంది ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల చప్టాలను దాటే క్రమంలో, అలాగే కృష్ణా నదిలో చేపల వేటకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకోగా పోలీసు సిబ్బంది వారిని రక్షించారు. విద్యుత్ స్తంభాలు నేలవాలగా.. కొన్ని కోట్ల తీగలు తెగి రోడ్ల పడ్డాయి. విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది ఎప్పటికప్పుడు తెగిపడిన విద్యుత్ తీగలను, నేల కూలిన చెట్లను తొలగిస్తూ.. ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పనిచేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పునరావాస కేంద్రాలను సందర్శించి, ఆశ్రయం పొందుతున్న ముంపు ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. వారికి కల్పించిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణాల్లో ఎక్కడికక్కడ నీరు నిలబడకుండా పారిశుధ్య సిబ్బంది పనిచేశారు.

- గుంటూరు-ఆంధ్రజ్యోతి



పెద్దమద్దూరు వాగు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు


బాపట్లలో ఈదురు గాలులకు వణికిపోతున్న కొబ్బరి చెట్లు


ఐనవోలు వద్ద వల్లేరు వాగు ఉధృతికి నిలిచిపోయిన రాకపోకలు


కొల్లూరులో గాలులకు వాలిపోయిన బొప్పాయి తోట


చిలకలూరిపేటలో పర్యటిస్తున్న కలెక్టర్ కృతికా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి


గుంటూరు జాతీయ రహదారిపై నిలిచిపోయిన లారీలు


తిమ్మాపురం అండర్ పాస్ వద్ద ప్రవహిస్తున్న వరద నీరు


గుంటూరు: ఏటి అగ్రహారంలో వర్షపు నీటిలో ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారుడు


గుంటూరు మురికి పేటలో పొంగిపొర్లుతున్న డ్రెయిన్

సస్యరక్షణతోనే వరి పంట చేతికి..!



- వరి పంటపై తుపాను ప్రభావం
- రైతులకు జాగ్రత్తలు పాటించాలి
- రంగా వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పీవీ సత్యనారాయణ

గుంటూరు సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో వరి పంట సంరక్షణకు రైతులు తీసుకోవాల్సిన చర్యలను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ బుధవారం వివరించారు. తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల రైతులు అప్రమత్తం కావాలని హెచ్చరించారు. ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ రైతులకు ఈ సూచనలు చేశారు. ప్రస్తుతం వరి పంట పూత దశ, పాలు పోసుకునే, కోత దశలలో ఉంది. వీలైనంత వరకు పొలం నుంచి వర్షపు నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపాలి. పూత దశకు ముందు ఉన్న చేలల్లో.. వర్షం తగ్గిన తర్వాత ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే ఎండాకు, మానిపండు తెగులు, మాగుడు, ఆకుముడత తెగుళ్లు, దోమపోటు పెరిగే అవకాశం ఉంది.

గింజ గట్టిపడే దశలో ఉంటే

నిరంతర వర్షాల వల్ల ధాన్యపు గింజలో నిద్రావస్థ తొలగి నిలబడి, పడిపోయిన చేలలో మొలక వచ్చే అవకాశం ఉంది. కోత దశలో నిలిచిన లేదా పడిపోయిన పంటలో కంకిలో మొలకలు కనపడితే.. నీరు బయటకు తీసివేసిన తర్వాత.. 5 శాతం ఉప్పు ద్రావణం (50 గ్రాములు కల్లు ఉప్పు/లీటరు నీటికి)కలిపి పిచికారీ చేయాలి. ఇది మొలకెత్తడాన్ని, రంగు మారడాన్ని తగ్గిస్తుంది.

కల్లాల మీద ధాన్యం ఉన్నప్పుడు

ఇప్పటికే కోతకోసి కుప్పల మీద ఉన్న ధాన్యాన్ని బరకాలు కప్పుకొని రక్షించుకోవాలి. నూర్పిన ధాన్యం రెండు మూడు రోజులు ఎండబెట్టడానికి వీలుకాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా క్వింటా ధాన్యానికి కేజీ ఉప్పు, 20 కేజీల పొడి ఊక కలపాలి.

పూత దశలో తెగుళ్ల నివారణ

రైతులు పంట దశ, పురుగు, తెగుళ్ల ఉధృతిని బట్టి సస్య రక్షణ చేపట్టాలి. బ్యాక్టీరియా ఎండాకు తెగులు కనిపిస్తే ప్లాంటోమైసిన్ ఒక మి.లీ/లీటరు + కొసైడ్ (కాపర్ హైడ్రాక్సయిడ్) 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- నీరు తగ్గిన తర్వాత హెక్సాకోనాజోల్ 400మి.లీ.. ఎకరాకు లేదా ప్రోపికోనాజోల్ 200 మి.లీ పిచికారీ చేయడం ద్వారా మాగుడు తెగులు వ్యాప్తి తగ్గుతుంది.
- మానిపండు తెగులు వ్యాప్తి నివారించడానికి ఎకరాకు 200 మి.లీ. ప్రోపికోనాజోల్ పిచికారీ చేయాలి.
- ఆకుముడత పురుగు నివారణకు ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రాములు లేదా క్లోరాన్ట్రిప్రోల్ 60 మి.లీ 200 లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- దోమపోటు, మాగుడు తెగులు, మానిపండు నివారణకు ఎకరాకు ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు ● పైమెట్రోజాన్ 120గ్రాములు లేదా ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు+96 మిల్లీలీటర్ల ట్రైఫ్లుమెజోపైరం 10 ఎస్‌సీ పిచికారీ చేసుకోవాలి.

తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీకి అందుబాటులో ఉన్న డ్రోన్‌లను ఉపయోగించుకోవాలి.

- పూత దశలో ఉన్న పంట (ఎంటీయూ-1061, ఎంటీయూ- 1318, ఎంటీయూ-1262, బీపీటీ-5204): నీరు నిలబడి ఉన్న చేలలో తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉంది. ధాన్యం రంగు మారకుండా, మానిపండు, మాగుడు తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉంది.
- పాలు పోసుకునే దశలో ఉన్న పంటలు (స్వర్ణ, సంపద స్వర్ణ, బీపీటీ- 5204, ఆర్ఎన్ఆర్-15048, కేఎస్ఎం-1638 మొదలైనవి) వర్షాలకు పడిపోతే పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలి. అవకాశాన్ని బట్టి పడిపోయిన పంటను పైకి లేపి కట్టుకోవాలి. నిలబడి ఉన్న, పడిపోయిన పంట చేలలో గింజలు రంగు మారడం, మాగుడు, మానిపండు తెగుళ్ల వ్యాప్తి నివారణకు ఎకరాకు 200 మి.లీ ప్రోపికోనాజోల్ పిచికారీ చేయాలి.

గుంటూరుకు పలు రైళ్ల పాక్షిక రద్దు

- డోర్నకల్‌లో రైలు పట్టాల పైకి వరద నీరు
- కొన్ని రైళ్లు గుంటూరు - పగడిపల్లి మార్గంలో మళ్లింపు



గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షం కారణంగా వరంగల్ సమీపంలోని డోర్నకల్ రైల్వేస్టేషన్ యార్డులోకి భారీగా వరద నీరు చేరి నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో గుంటూరుకు రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేశారు. బుధవారం ఉదయం 17201 గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను డోర్నకల్ సమీపానికి వెళ్లేసరికి రైలు పట్టాలపై వరద నీరు చేరడంతో అక్కడే నిలిపేశారు. వరద తగ్గుముఖం పట్టకపోవడంతో ఈ సర్వీసును రద్దు చేశారు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని కూడా వరంగల్ వరకే నడిపి వరంగల్ - గుంటూరు మధ్యన రద్దు చేశారు. దీని వల్ల మధ్యాహ్నం గుంటూరు నుంచి బయలుదేరాల్సిన 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీని పూర్తిగా రద్దు చేయాల్సి వచ్చింది. 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని పగిడిపల్లి - నడికుడి మీదగా గుంటూరుకు దారి మళ్లించారు. 20833 విశాఖపట్టణం - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ని విజయవాడ నుంచి కృష్ణాకెనాల్, గుంటూరు, పగిడిపల్లి మీదగా మళ్లించి సికింద్రాబాద్‌కు తీసుకెళ్లారు. 12787 నరసపూర్ - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, 17205 షిర్డి సాయినగర్ - కాకినాడ పోర్టు ఎక్స్‌ప్రెస్, 11019 ముంబై సీఎస్‌టీ - భువనేశ్వర్, 18046 చర్లపల్లి - షాలిమార్, 17206 కాకినాడ పోర్టు - షిర్డి సాయినగర్, 17405 తిరుపతి - అదిలాబాద్, ఎక్స్‌ప్రెస్‌లను కూడా గుంటూరు, పగిడిపల్లి మీదగా మళ్లించారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్ రద్దు

12747 గుంటూరు - వికారాబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్ రోజులానే వికారాబాద్‌కు వెళ్లింది. ఇదే రేక్ నంబరు 12748గా మారి వికారాబాద్ - గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌గా రిటర్న్ రావాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో రద్దు చేశారు. దీంతో గురువారం ఉదయం గుంటూరు నుంచి పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు. వికారాబాద్ నుంచి పల్నాడు ఎక్స్‌ప్రెస్ సర్వీసుని గురువారం పునరుద్ధరిస్తామన్నారు.

డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు

- మొంథా తుపానుతో పలు సర్వీసులు రద్దు


గుంటూరులో డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు


గుంటూరు-2 డిపో గ్యారేజ్‌లోకి చేరిన వర్షపునీరు

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో అత్యధిక బస్సు సర్వీసులు ఆర్టీసీ డిపోలకే పరిమితమయ్యాయి. మూడు రోజులుగా గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ ప్రయాణికుల్లేక బోసిపోతోంది. మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల్లోనూ సర్వీసులను తగ్గించుకోవాల్సి వచ్చింది. తుపాను ప్రభావం చూపిన బుధవారం ఆర్టీసీ యంత్రాంగం అప్రమత్తమైంది. గుంటూరు ప్రజా రవాణాధికారి డి. సామ్రాజ్యం ఎప్పటికప్పుడు పలు రూట్‌ల పరిస్థితిని సమీక్షించారు. సర్వీసులను రద్దు చేశారు. అమరావతి రూట్, తెనాలి, బాపట్ల, పర్చూరు, మాచర్ల వంటి రూట్‌లలో రహదారుల పరిస్థితి, చప్టాల వద్ద వరదలు కారణంగా.. ఆయా రూట్‌లలో బస్సులను నిలిపివేశారు. ఆర్టీసీ ఆదాయంపై మొంథా తుపాను ప్రభావం పూర్తి స్థాయిలో కనిపి స్తోంది. మూడు రోజు లుగా ప్రయా ణికుల రాకపోకల్లేక బస్సులు అరకొర ప్రయాణికులతో నడుస్తున్నాయి. మరో రెండు రోజులుగా ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సాగర్ ఘాట్ రోడ్డులో విరిగిపడ్డ కొండ చరియలు

విజయపురిసౌత్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నాగార్జున సాగర్ సరిహద్దు.. అంతరాష్ట్ర చెక్‌పోస్టుకు వెళ్లే ఘాటు రోడ్డులో కొండ చరియలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు ఆ వైపు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ ఎస్ఐ ఘటనా ప్రాంతానికి చేరుకొని క్రేను సాయంతో కొండ చరియలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రవికుమార్, వీఆర్‌ఏ రవి తదితరులు పాల్గొన్నారు.


రహదారిపై విరిగిపడ్డ కొండ చరియలు

గుంటూరు - పగిడిపల్లి సెక్షన్‌లో..
విద్యుత్ ట్రాక్షన్ రెట్టింపు

- రూ. 188.31 కోట్ల నిధులకు ఆమోదం తెలిపిన కేంద్రం
- విష్ణుపురం - మోటుమర్రి సెక్షన్‌లోనూ ఏర్పాటు


రైల్వే విద్యుత్ ట్రాక్షన్

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - పగిడిపల్లి సెక్షన్‌లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ట్రాక్షన్ సామర్థ్యాన్ని రైల్వే శాఖ రెట్టింపు చేసేందుకు నిర్ణయించింది. 1 25 కేవీ విద్యుత్ ట్రాక్షన్‌ని సామర్థ్యాన్ని 2 25 కేవీకి పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. మూడేళ్లలో ఈ ప్రాజెక్టుని రూ.188.31 కోట్లతో పూర్తి చేస్తారు. ఇందులో భాగంగా సర్క్యూట్ బ్రేకర్ల మార్పు, స్విచ్చింగ్ స్టేషన్లు, అదనపు కండ క్టర్లను ఏర్పాటు చేయడం వంటి పనులు చేస్తారు. దీని వల్ల విద్యుత్ ప్రసార నష్టాలు గణనీయంగా తగ్గిపోతాయి. అలానే రైళ్లను 160 కిలోమీటర్ల వేగంతో నడిపేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. విపత్తులు, ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల సమయంలో వరంగల్ మార్గంలో ప్రయాణిం చే రైళ్లను పగిడిపల్లి మీదగా మళ్లిస్తోన్న దృష్ట్యా విద్యుత్ ట్రాక్షన్ రెట్టింపు ఎంతో అవసరమని రైల్వే శాఖ భావిస్తోంది. హైదరాబాద్, అమరావతిని కలిపే రైలు మార్గాల్లో గుంటూరు - పగిడిపల్లి సెక్షన్ ఒకటి. విష్ణుపురం - మోటుమర్రి మధ్యన గూడ్స్ ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా రైలుమార్గం ఉంది. మొత్తం 337 కిలోమీటర్ల పొడవునా విద్యుత్ ట్రాక్షన్‌ని రెట్టింపు చేయాలని రైల్వే శాఖ ప్రతిపాదించింది. ట్రాక్షన్ రెట్టింపు వల్ల అధిక వోల్టేజీతో విద్యుత్ సరఫరా అందిస్తుంది. తద్వారా రైళ్లు, గూడ్స్‌లను అధిక వేగంతో, ఎక్కువ సామర్థ్యంతో నడపడానికి ఆస్కారం ఏర్పడుతుంది. రైళ్లకు అవసరమైన స్థిరమైన వోల్టేజీని సులభతరం చేస్తుంది. సర్క్యూట్ లోపాలను అధిగమించి నిరంతర విద్యుత్ సరఫరాని అందిస్తుంది. దీని వల్ల సబ్‌స్టేషన్ల సంఖ్యని కూడా తగ్గించుకోవచ్చు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ ప్రాజెక్టుకి బుధవారం పచ్చజెండా ఊపుతూ సికింద్రాబాద్ - విజయవాడ చాలా రద్దీగా ఉండే రైలు మార్గాల్లో ఒకటిగా ఉందన్నారు. పగిడిపల్లి - గుంటూరు, విష్ణుపురం - మోటుమర్రి సెక్షన్ సికింద్రాబాద్, విజయవాడ మధ్య ప్రత్యామ్నాయంగా పని చేస్తుందన్నారు. ఈ మార్గంలో మరిన్ని రైళ్లు నడపడానికి 2 25 కేవీ విద్యుత్ ట్రాక్షన్ ఎంతో అవసరమని గుర్తించి ప్రాజెక్టుని మంజూరు చేశామన్నారు.

నానో యూరియాపై అవగాహన కల్పించాలి

● వ్యవసాయ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

గుంటూరు సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నానో యూరియాపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. బుధవారం తుపాను అనంతర పరిస్థితులను పరిశీలించుటకు ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో పర్యటించిన కలెక్టర్ కాకుమానులో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో యూరియా నిలువలు, నానో యూరియాను పరిశీలించారు. వ్యవసాయ శాఖ జేడీ అయితా నాగేశ్వరరావు ఎరువులు, నానో యూరియాను గురించి వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నానో యూరియాపై రైతులకు విశ్వాసం కలిగే వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

● కాకుమాను మండలంలోని కొల్లిమర్ల గ్రామం వద్ద కొల్లిమర్లవాగు లాకులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, జేడీఏ నాగేశ్వరరావు, జలవనరులశాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

ఉల్లి, అరటి పంటలపై ప్రభావం


నీటమునిగిన ఉల్లి పంట, అరటి తోట

తాడేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో ఉల్లి, మరో 200 ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లిందని రైతులు చెప్పారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉల్లి పంట మునిగిపోయిందని వాపోయారు. మరో నెలలో పంట చేతికి వస్తున్న దశలో తుపాను రైతులను కోలుకోలేని దెబ్బ తీసిందన్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.80వేలు పెట్టిన రైతులకు దాదాపు రెండు కోట్ల నలభై లక్షల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. సుమారు 200 ఎకరాల్లో అరటి వేసిన రైతుల ఎకరానికి రూ.50వేలు పెట్టామని, సుమారు కోటి రూపాయల నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేశారు. గులాబీ, లిల్లి తదితర పూల తోటలు కూడా నీట మునిగాయన్నారు.



దుగ్గిరాల చెన్నకేశవ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనూ, జాషు వానగర్ చర్చి, వ ఎఎర ప్త జాన గర్ షాదీఖానాల్లోనూ, పునరావాసం పొందుతున్న సుమారు 200 మందికి స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు భోజనాల ఏర్పాటుతో పాటు, ఉదయం అల్పాహారాన్ని అందించారు. (దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)

వరద బాధితులకు ఆర్థిక సాయం

పెదనందిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గోగులమూడి జడ్పీ హైస్కూల్లోని పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ఎస్టీ కాలనీ వాసులకు తెలుగుమహిళా మండల అధ్యక్షురాలు చిన్నం ఈశ్వరమ్మ బుధవారం ఆర్థిక సాయంతో పాటు వారికి అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు ఆముదాలపల్లి నరేంద్ర, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో టీడీపీ నేతల పర్యటన

తాడేపల్లిటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో తాడేపల్లి పట్టణ టీడీపీ నాయకులు బుధవారం తుపాను ముంపు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేట, రాయల్ పబ్లిక్ స్కూల్, ముగ్గురోడ్డు సీతానగరం ప్రాంతాల్లోని ప్రజల వద్దకు స్వయంగా వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ కిరణ్‌చంద్

మంగళగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంగళగిరి మార్కెట్ యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ చెప్పారు. తుపాను ధాటికి ముంపునకు గురైన పంట పొలాలను బుధవారం ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కిరణ్‌చంద్ మాట్లాడుతూ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వరి, అరటి, మినుము, క్యాలీఫ్లవర్ పంటలు దెబ్బతిన్నాయని, పంట నష్టం అంచనా వేసి రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

వడ్డేశ్వరంలో నిత్యావసరాల పంపిణీ


నిత్యావసర సరకులు అందజేస్తున్న దాతలు

తాడేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరం గ్రామం రాధారంగానగర్‌లో మూడు రోజుల నుంచి తుపాను ప్రభావం వల్ల కల్యాణ మండపంలో తు పాను షెల్టర్ ఏర్పాటు చేసి 85 మందికి ఆశ్రయం కల్పించారు. టీడీపీ సీనియర్ నాయకులు బావినేని రూప్‌కుమార్ (నాని), శరణ్య దంపతుల సహకారంతో తుపాను షెల్టర్‌లో తలదాచుకున్న 40 కుటుంబాలకు 9 రకాల నిత్యావసర సరుకులు, మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో అందజేశారు.

అప్పుల వేధింపులతోనే శేషమ్మ ఆత్మహత్య

● నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు
● టీడీపీ నాయకుడికి సంబంధం లేదు
● సౌత్ ఇన్‌చార్జి డీఎస్పీ అరవింద్

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన ఈపూరి శేషమ్మ(44) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని సౌత్ ఇన్‌చార్జ్ డీఎస్పీ అరవింద్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఆయన నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వాస్తవ పరిస్థితులను వివరించారు. పురుగుల మందు తాగుతూ తన ఆత్మహత్యకు కారణాలు వెల్లడిస్తూ ఆమె తీసుకున్న సెల్ఫీ వీడియోలో బాధతురాలి తడబాటును ఆసరాగా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. వైసీపీకి చెందిన కృష్ణవేణి పాలేటి, శ్యామల రెడ్డి వైసీపీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా కులాలు, పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఈపూరి శేషమ్మ మరణానికి టీడీపీ గుంటూరు పార్లమెంటు అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అనుచరుడు కల్లూరి శ్రీను కారణమని.. వైసీపీ కేడర్ వివిధ ప్రచార మాధ్యమాల్లో షేర్ చేసిందన్నారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునే కంగారులో మృతురాలు శేషమ్మ సెల్ఫీ వీడియోలో తడబడిందన్నారు. శ్రీరామశెట్టి పద్మ, సీత (పద్మ చెల్లెలు), పద్మ పెద్ద కుమారుడు, ఈపూరి రమేష్, పుట్ట జానీ కోడలు జాన్ బీ, కర్లపూడి శ్రీను అనే వారు తన మరణానికి కారణమని ఆ వీడియోలో ఆమె ఆరోపించిందన్నారు. సెల్ఫీ వీడియోలో మృతురాలు ఒక సమయంలో కల్లూరి శ్రీను పేరును ప్రస్తావించగా, ఆమె స్వయంగా కర్లపూడి శ్రీను అని పేరును సరిదిద్దుకున్నట్లు కూడా గమనించినట్లు చెప్పారు. వీడియోలోని మరొక భాగంలో పద్మ అక్క అని పేర్కొని తనకుతానుగా 'చెల్లి' అని సరిదిద్దుకుందని చెప్పారు. ఇలా తడబడిన అంశాన్ని ఆసరాగా చేసుకుని వైసీపీ కేడర్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. కల్లూరి శ్రీనుకు ఈ కేసుతో ఎటువంటి సంబంధం లేదని స్పష్టంగా నిర్ధారించబడిందన్నారు. ప్రాథమికంగా కేసు నమోదైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కేసు నల్లపాడు పోలీస్‌స్టేషన్ దర్యాప్తు అధికారికి ఉత్తర్వులు ఇచ్చినట్లు డీఎస్పీ అరవింద్ తెలిపారు.

ముంచెత్తిన మొంథా తుఫాన్

● చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
● పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
● వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్


పెదనందిపాడులో ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లమడ వాగు

పెదనందిపాడు,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాలను మొంథా తుఫాన్ ముంచెత్తింది. మంగళవారం రాత్రి తీరం దాటుతున్న సమయంలో ఎడతెరిపిలేకుండా ఈదురు గాలులతో కూడి వర్షం కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వర్షాలకు పంట పొలాల్లోకి భారీగా నీరు చేరింది. రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి, సోయాబీన్ పంటలు కాయదశలో ఉండగా అధిక వర్షాలకు ఉరకెత్తి దెబ్బతింటున్నాయి. కాలువల ద్వారా ఎగువ నుంచి దిగువకు వచ్చే వరదనీరు పారుదల లేక గుంటూరు - పర్చూరు రహదారిలోని పలు చోట్ల ప్రధాన రహదారిపై పొంగిపొర్లడంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం రాకపోకలు కొనసాగించరాదంటూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. నల్లమడ, ఓగేరు, మేకల, నక్క వాగులు, ప్రమాదపు టంచున ప్రవహిస్తుండడంతో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మండల పరిధిలోని ముంపు ప్రాంతాలను ఆమె ట్రాక్టర్‌పై పర్యటించి అధికారులు పలు సూచనలు చేశారు. నల్లమడ వాగు ఉధృతిని పరిశీలించి ఎన్ని క్యూసెక్కుల నీరు వస్తుందని డీఈని అడిగి తెలుసుకున్నారు. చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద లోలెవల్ చప్టాపై ప్రవహిస్తున్న వరదనీటిని పరిశీలించారు. ఎస్సీ బాలుర వసతిగృహంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి పరిస్థితులను బాధితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఏవో ఐతా నాగేశ్వరరావు, ఉద్యానశాఖ ఉపసంచాలకులు రవీంద్రబాబు, జలవనరులశాఖ పర్యవేక్షణ ఇంజనీర్ వెంకటరత్నం, తహసీల్దార్ హేనాప్రియ, ఎంపీడీవో స్వామిరెడ్డి, ఏవో సుబ్రహ్మణ్యం, వైద్యాధికారి ప్రియంవద, జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● వరద ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్‌కు నల్లమడ వాగు కట్ట ప్రాంత వాసులు తమకు ఇళ్ల పట్టాలు ఇచ్చి నిర్మాణాలు చేపట్టాలంటూ తమ గోడు వెళ్లబోసుకున్నారు. అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం : కలెక్టర్

కాకుమాను, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాకుమాను ఎస్సీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. వరద బాధితులకు అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా అమలవుతున్న పునరావాస కేంద్రాల వివరాలను తహసీల్దార్ వెంకటస్వామిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ప్రత్యేక అధికారులు, తహసీల్దార్‌లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. రేపటి నుంచి గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు. అలాగే వాగులు, డ్రెయిన్‌లు కూడా మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులతో కలసి పంట పొలాలను సందర్శించారు. పంట నష్టాలను అంచనా వేయాలని ఏవో సుధాకర్‌కు చెప్పారు.


కాకుమానులో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ప్రత్తిపాడులో పర్యటించిన కలెక్టర్

ప్రత్తిపాడులో ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించారు. జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అందులో నివాసం ఉండే ఎస్టీ కాలనీ వాసులతో మాట్లాడారు. తమ కాలనీ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్తిపాడు కళాశాల ఎదుట లోలెవల్ బ్రిడ్జిని ఆమె పరిశీలించారు. మార్గాన్ని చూసి వెంటనే పరిష్కరించాలంటూ ఆమె అధికారులను ఆదేశించారు.

మొంథా తుఫానుతో ప్రత్తిపాడు అతలాకుతలం

● నిండా మునిగిన వంగిపురం, వేల ఎకరాల పొలాలు
● కొండ్రుపాడు రోడ్డులో బ్రిడ్జికి గండి, పొంగి పొర్లిన వాగులు


ప్రత్తిపాడు ఎస్టీ కాలనీలో నీట మునిగిన గృహాలు

ప్రత్తిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రత్తిపాడును అతలాకుతలం చేసింది. మంగళవారం ఉదయం చిరు జల్లులతో మొదలై అర్ధరాత్రి దాటిన దగ్గర నుంచితన ప్రభావం చూపడం మొదలైంది. ఈదురు గాలులతో పాటు భారీ వర్షం బుధవారం తెల్లవారుజాము వరకు ఏకధాటిగా కురుస్తూనే ఉంది. దీంతో ప్రత్తిపాడులో కురిసిన వర్షాలతో పాటు కొండలపై నుంచివచ్చే వరద నీటితో కొండ వాగులు పొంగి ప్రత్తిపాడును జలదిగ్బంధం చేసింది. దీంతో ప్రత్తిపాడులోని చిన్నచెరువు పొంగి వరద గ్రామం మీదకు వచ్చింది. ప్రధాన రహదారితో పాటు తహసీల్దార్ కార్యాలయం మొత్తం నీట మునిగిపోయింది. అంతే కాకుండా ఎస్టీ కాలనీలోనికి నీరు చేరాయి. అయితే ముందుగానే అధికారులు అప్రమత్తమై వారిని పునరావాస కేంద్రానికి తీసుకురావడంతో ఇబ్బంది ఏమీ లేకుండా ఉంది. అలాగే గుంటూరు, పెదనందిపాడు రోడ్డులో జూనియర్ కళాశాల ఎదుట ఉన్న లోలెవల్ బ్రిడ్జి , బొర్రావారిపాలెం వద్ద, గొట్టిపాడు రోడ్డులో ఉన్న లోలెవల్ బ్రిడ్జి పొంగి పొర్లింది. చినకొండ్రుపాడు వెళ్లే రహదారిలో బ్రిడ్జి ఇప్పటికే మొత్తం కోతకు గురైంది. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత కూడా ప్రయాణించడానికి వీల్లేకుండా ఉంది.


గుంటూరు - పర్చూరు రహదారిలో కళాశాల వద్ద లోలెవల్ చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు

వరద నీరు ఎప్పటి లాగానే వంగిపురం ప్రాంతాన్ని ముంచెత్తింది. వంగిపురంతో పాటు తిమ్మాపురం, పాతమల్లాయపాలెం, రావిపాడు గ్రామాలలోని వేలాది ఎకరాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. ఈ ప్రాం తం మొత్తం సముద్రాన్ని తలపించే విధంగా ఉన్నాయి. కొండలపై నుంచివచ్చే రామవాగు, కొండవాగు, మేకలవాగు, నక్కల వాగుల వంటి పలు కాలువలు ఈ గ్రామం మీదగా వెళుతుంటాయి. అనేక చోట్ల కాలువలకు గండ్లు పడి పొలాల మీదకు వరద నీరు వచ్చి చేరింది. అంతే కాకుండా చెరువు కూడా పొంగి పక్కనే ఉన్న గుడిలోకి నీరు చేరడంతో చెరువు కట్ట బలహీనంగా ఉండి ఏ క్షణానైనా తెగిపడే ప్రమాదం ఉంది.

అన్నదాతల్లో నైరాశ్యం


నీటమునిగిన పంట పొలాలు

కాకుమాను, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో అన్నదాతలో నైరాశ్యం నెలకొంది. మండలంలో సుమారు 33 వేల ఎకరాల్లో వరిని అన్నదాతలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది పైరు బాగానే ఉందని దిగుబడులు కూడా బాగానే వస్తాయి అనుకున్న రైతులకు మొంథా తుఫాన్ నష్టాలనే మిగిల్చిందని వాపోతున్నారు. బుధవారం వేకువజాము నుంచే భారీ గాలులతో పాటు ఒక మోస్తరు వర్షం కురిసింది. ఈనిక దశలో ఉన్న వరికి కొంత నష్టాన్ని మిగిల్చింది. ఈదురు గాలుల ప్రభావంతో నేలకి ఒరిగిన పంటలకు నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. చిగురు దశలో ఉన్న వరి వర్షం వల్ల తాలుగింజలు ఏర్పడతాయని అన్నదాతలు చెబుతున్నారు. వరద ప్రభావంతో నల్లమడ డ్రెయిన్, అప్పాపురం చానల్, తదితర వాగులు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్నాయి. తుపాన్ ప్రభావంతో కొండపాటూరు నుంచి అప్పాపురం వచ్చే ప్రధాన రహదారిలో లోలెవల్ చప్టా భారీగా వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వరి పొలాల్లో నిలిచిన వాన నీటిని బయటకు పంపేందుకు రైతులు ఆయిల్ ఇంజన్‌ల సహాయంతో నీటిని బయటకు పంపే పనిలో నిమగ్నమయ్యారు.

పునరావాస కేంద్రాల నిర్వాహణలో అలసత్వం వద్దు

● మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

వట్టిచెరుకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మండలపరిధిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించిన వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మండల అధికారులకు సూచించారు. ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దార్ క్షమారాణి, సర్పంచ్ దేవితో కలసి మండలపరిధిలోని చమళ్ళమూడి, అనంతవరప్పాడు, గారపాడు, ముట్లూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. వారి వెంట గ్రామాల సెక్రటరీలు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ హేమంత్, రెవెన్యూసిబ్బంది ఉన్నారు.

మాగాణి భూముల్లో వరి ప్రస్తుతం చిగురు పొట్ట దశలో ఉందని, అలాగే పత్తి చేలల్లో ఉన్న నిల్వలను సాధ్యమైనంత వరకు బయటకు పంపేందుకు చూడాలని రైతులకు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త మనోజ్ బుధవారం వట్టిచెరుకూరు పల్లపాడు, సౌపాడు గ్రామాల ఆయకట్టు పరిధిలోని వరి పైరు, యామర్రు వద్ద పత్తి పొలాలను మండల ఏవో సునీత రైతులతో కలసి పంటలను పరిశీలించారు.


ముట్లూరులో పునరావాస కేంద్రంలో ఆర్థిక సాయం అందిస్తున్న జడ్పీటీసీ కల్యాణ చక్రవర్తి, ఏవో సునీత

● ఎమ్మెల్యే బూర్ల రామంజనేయులు సూచనల మేరకు స్థానిక ఎంపీటీసీ గోగినేని కళ్యాణ్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.5 వేల నగదును ఏవో చందోలు సునీత, గోగినేని శ్రీనివాస కృష్ణ, వెంకటరావు, వీఆర్వో ఆదినారాయణ జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల బాధితులకు నగదును అందజేశారు.

ఇబ్రహీం ప్రమాణ స్వీకార ర్యాలీ

మంగళగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన మహమ్మద్ ఇబ్రహీం బుధవారం ప్రమాణస్వీకారం చేసేందుకు మంగళగిరి నుంచి భారీ ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. పాతబస్టాండు సెంటరు నుంచి టీడీపీ శ్రేణులతో కలిసి విజయవాడలోని ఓ హోటల్‌లో జరిగిన మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ పార్టీ కోసం ఇబ్రహీం అందించిన సేవలను గుర్తించి డైరెక్టర్ పదవితో గౌరవించడం సముచితమని అన్నారు. ఈ కార్యకమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, నేతలు గోవాడ దుర్గారావు, పఠాన్ ఖాశీం ఖాన్, బి.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, షేక్ నజీర్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి : జంగాల

మంగళగిరి సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని, క్రాప్ ఇన్సూరెన్స్ పునరుద్ధరించాలని సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పెదవడ్లపూడి, నూతక్కి, చిర్రావూరు, దుగ్గిరాల, మంచికలపూడి గ్రామాల్లో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను సీపీఐ, రైతు సంఘం నేతలు బుధవారం పరిశీలించారు.

బాధితులకు ఆర్థికసాయం అందించాలి : బాబూరావు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుపాను వల్ల బాధితులైన ప్రజలందరికి ఆర్థికసాయం అందించాలని సీపీఎం నేత చిగురుపాటి బాబూరావు కోరారు. బుధవారం తాడేపల్లిలోని ముగ్గురోడ్డు, పుష్కరకాలనీ, బోటుయార్డు, తదితర ప్రాంతాల్లోని పునరావాస శిబిరాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ సహకారాలపై ఆరా తీశారు. శిబిరాలను సందర్శించిన సీపీఎం బృందంలో నేతలు నేతాజీ, రవి, దొంతిరెడ్డి బర్నబాస్ తదితరులు ఉన్నారు.


లాం వద్ద కొండవీటి వాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం లాం చప్టా వద్ద ప్రవహిస్తున్న కొండవీటి వాగును శ్రావణ్‌కుమార్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి లాం చప్టాపై నుంచి కొండవీటి వాగు ప్రవహించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అక్కడకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అధికారులు, నాయకులతో మాట్లాడారు. ఫిరంగిపురం, మేడికొండూరు, పేరేచర్లలో వర్షపాతం ఎక్కువగా ఉండటంతో కొండవీటివాగుకు వరద ఉధృతి వస్తుందన్నారు. గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావుతో ఫోన్‌లో మాట్లాడి వర్షపాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. చప్టా వద్ద ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చే విధంగా ఆర్అండ్‌బీ అధికారులకు తెలియజేస్తానని తెలిపారు. గరికపాడు, మోతడక, నిడుముక్కల, లాం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవటంతో వాటి స్థానంలో కొత్త స్తంభాలు వేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కొత్త స్తంభాలను అందుబాటులో ఉంచుకొని అత్యవసర సమయాల్లో వినియోగించాలని సూచించారు.

ప్రైవేటు వెంచర్ల వద్ద తూములు తొలగించాలి

తాడికొండ, లాం, దామరపల్లి, గరికపాడు, నిడుముక్కల పరిధిలో ప్రైవేటు వెంచర్ల నిర్వాహకులు కాల్వల్లో చిన్న చిన్న తూములు వేయటం వల్ల వర్షం నీరు సక్రమంగా పారుదల లేకపోవడంతో వర్షం నీరు రోడ్లు, పొలాల్లోకి చేరుతుందని స్థానిక నాయకులు, అధికారులు ఆయనకు తెలిపారు. దీని వలనే కొండవీటివాగుకు వరద ఎక్కువగా వస్తుందని అన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వర్షాలు తగ్గిన తరువాత చిన్న, చిన్న తూములు వేసిన వెంచర్ల వద్ద తొలగించాలని, కాల్వల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని అధికారులను అదేశించారు. లాం చప్టాపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అదేశించారు.


తాడికొండలో నీటి మునిగిన పత్తి పంట

తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్న ప్రభుత్వం

● పునరావాస కేంద్రాల్లో బాధితులకు చిల్లపల్లి పరామర్శ


పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

దుగ్గిరాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కూటమి ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతమైన పాత్ర పోషించిందని, ఆంధ్రప్రదేశ్ మెడికల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈమనిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని చిల్లపల్లి బుధవారం సందర్శించారు. అక్షయపాత్ర ద్వారా పునరావాసకేంద్రాల్లో తలదాచుకున్న వారికి భోజన సదుపాయం కల్పించారన్నారు. కూటమి నాయకులతో కలిసి పునరావస కేంద్రాల్లోని వారికి భోజనం వడ్డించారు. ఈమని మెయిన్‌రోడ్డు నుంచి ఎన్టీఆర్ కాలనీలోకి వెళ్లేందుకు అతిసమీపంగా చర్చిమీదుగా రోడ్డు వేయించాలని కోరారు. వైద్యసిబ్బందితో మాట్లాడారు. తిరుమలశెట్టి కొండలరావు, సామల నాగేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ సహకారంతో 4న అయ్యప్ప పడిపూజ

మంగళగిరి సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నవంబరు 4వ తేదీన స్థానిక శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఉత్సవ గ్రౌండులో అయ్యప్ప స్వామి పడిపూజా మహోత్సవం జరుగనుంది. పడిపూజకు సంబంధించి నియోజకవర్గంలోని గురుస్వాములు బుధవారం దిగువ సన్నిధిలోని ముఖమండపంలో సమావేశమై పడి పూజ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా గురుస్వాములు, నిర్వాహకులు మాట్లాడుతూ 4న సాయంత్రం 6 గంటలకు జరుగనున్న పడి పూజా మహోత్సవానికి లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు.


ఎస్సీ కార్పొరేషన్ రుణాలు విడుదల చేయాలి

మంగళగిరి సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలను తక్షణమే విడుదల చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం మంగళగిరి టిప్పర్ల బజారులోని కార్యాలయంలో గోనే లూథర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీల ఆర్థికాభివృద్ధికి కావలసిన ఎస్సీ కార్పొరేషన్ నిధులను విడుదల చేయడంలో జాప్యం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి నవీన్‌ప్రకాష్, నేతలు విజయరాజు, కోటేశ్వరరావు, సుందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై 7న ధర్నాలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమ స్యలను పరిష్కరించాలని కోరుతూ నవంబరు 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఏడీ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్టు ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్‌యూబీలు, లోలెవల్ చప్టాలపై వర్షపు నీరు


గుండాలపాడులో లోలెవల్ చప్టాపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఫిరంగిపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రైల్వే అండర్ బ్రిడ్జీలు, ఏడు లోలెవల్ చప్టాలు బుధవారం ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. వీటి ఉధృతికి ఆయా గ్రామాల రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. మండలంలో 116 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ జే ప్రసాదరావు తెలిపారు. తుఫాన్ సహాయక చర్యల కోసం తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలు, వైద్య ఆరోగ్య సిబ్బంది సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆర్‌యూబీల వద్ద, లోలెవల్ చప్టాల వద్ద కావలా ఉండి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టారు.

ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలి

వైద్యాధికారి వేముల ప్రియాంక

తెనాలి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని నందులపేట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. తుపాను తరువాత ప్రజలు జాగ్రత్తలు తీసుకోకపోతే రోగాలబారిన పడాల్సి ఉంటుందన్నారు. ఆహారం వేడి వేడిగా ఉన్నప్పుడు భుజించాలని, దోమల నుంచి రక్షణ పొందాలన్నారు. శివారు కాలనీల్లో నివసించే ప్రజలు ఇళ్ల చుట్టూ నీరు నిలబడితే తొలగించుకోవాలన్నారు. ఏదైనా అనారోగ్యం కలిగితే ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



తూములూరు పునరావాస కేంద్రంలో ఉన్నవారితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రభుత్వం అండగా ఉంటుంది

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అత్తోట, తూములూరు పునరావాస కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారిని సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎటువంటి ప్రాణ నష్టం జరుగకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందస్తు చర్యలు తీసుకున్నారన్నారు. తుఫాన్ కారణంగా ముందస్తుగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించి వారికి తగిన వసతులు కల్పించినట్లు తెలిపారు. పెనుగాలుల మూలకంగా వరి, అరటి, మినుము పంటలు పలు చోట్ల దెబ్బతిన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోనున్నట్లు తెలిపారు. రైతులు ఆధైర్యపడవద్దని ... అండగా ఉంటామని జరిగిన నష్టానికి కూటమి ప్రభుత్వం తప్పక న్యాయం చేస్తుందని తెలిపారు. వర్షంవల్ల దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి నష్టాన్ని అంచనా వేయనున్నట్లు తెలియజేశారు. అనంతరం కొల్లిపర, చివలూరు, తూములూరు పరిసర ప్రాంతాల్లో పెనుగాలులకు పడిపోయిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ నాయకులు చాగంటి నారాయణరెడ్డి, కంచర్ల అమృతరాజు, సాల్మన్‌రాజు, కొల్లి కోటిరెడ్డి, కొరారు అంజనేయులు, దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



తూములూరు పునరావాస కేంద్రంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహ

ముందస్తు చర్యలతో ప్రాణనష్టం నివారణ

● సబ్‌కలెక్టర్ సంజనా సింహ

కొల్లిపర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ప్రాణనష్టం జరుగకుండా తగిన చర్యలు తీసుకున్నామని సబ్ కలెక్టర్ సంజనా సింహ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అత్తోట, తూములూరు గ్రామాల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను ఆమె మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మితో కలిసి పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లోని వారిని పలకరించి వసతులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా అధికారులను, ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. పలు చోట్ల భారీ వృక్షాలు పడిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగిందన్నారు. పడిపోయిన చెట్లను యుద్ధప్రాతికన తొలగిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను ఇవ్వడం జరిగిందన్నారు. రూరల్ గ్రామాల్లో కూడా విద్యుత్‌ను ఇవ్వటానికి యుద్ధ ప్రాతికపతిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పునరావాస కేంద్రాల్లో తగిన వసతులు కల్పించటంతో పాటు, జనరేటర్లను, మెడికల్ క్యాంపును కూడా ఏర్పాటు చేశామన్నారు. పెనుగాలులు మూలంగా దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారన్నారు. కార్యక్రమంలో మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, అడపా నారాయణరెడ్డి, కొరారు అంజనేయులు దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



శివరామకృష్ణను సన్మానిస్తున్న మానవత సభ్యులు

తత్త్వవేత్త శివరామకృష్ణకు సన్మానం

తెనాలి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తత్త్వవేత్త, జర్నలిస్టు తాళ్లూరి శివరామకృష్ణను మానవత సంస్థ సభ్యులు సత్కరించారు. ఐతానగర్‌లో ఉంటున్న ఆయనను బుధవారం కలిసి సన్మానించారు. 90 సంవత్సరాలు పైబడిన పెద్దలను కలిసి వారి అనుభవాలను తెలుసుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. 93 ఏళ్ల వయసులో కూడా ఆరోగ్యంగా ఉండటం ఆహార అలవాట్లను తెలుసుకుని పది మందికి తెలియజెప్పాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని మానవత అధ్యక్షుడు కొలసాని రాంచంద్ చెప్పారు. ఉదయం డ్రై ఫ్రూట్స్, మధ్యాహ్నం ముడిబియ్యంతో అన్నం, పండ్లు, సాయంత్రం 6.30 గంటలకే భోజనం చేస్తానని, ప్రతిరోజు ఉదయం 12 ఆసనాలతో యోగా చేయడం, మంచి ఆరోగ్యానికి కారణమని ఆయన వారికి వివరించారు. కార్యక్రమంలో గుజ్జర్లమూడి కృపాచారి, వాసు, వెంకట్, ప్రసాద్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రారంభం

తెనాలి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును డబుల్ హార్స్ సంస్థ ఎండీ మునగాల శ్యాంప్రసాద్ బుధవారం ప్రారంభించారు. బ్యాంకులోని పలు విభాగాలను పోస్టల్ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు, కుమార్ గ్రూప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, డాల్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు నంబూరు కృష్ణమూర్తి ప్రారంభించారు. రీజనల్ హెడ్ కోట శ్రీనివాసులు మాట్లాడుతూ, మల్టీ స్టేట్ బ్యాంకుగా ఆవిర్భవించి రూ.3608 కోట్ల వ్యాపారం సాధించామని, రాష్ట్ర వ్యాప్తంగా 67 బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. రాత్రి ఏడు గంటల వరకు బ్యాంకు సేవలు అందుతాయని, ఖాతాదారుల కోసం జిరాక్స్‌ను కూడా ఉచితంగా ఏర్పాటు చేశామని, ప్రతి సేవింగ్స్ ఖాతాదారునికి రూ2 లక్షలు ప్రమాద బీమా ఉందన్నారు. ఆర్థిక లావాదేవీలకు ఫోన్‌పే, గూగుల్‌పే కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో జనజీవనం అస్తవ్యస్తం

● పడిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

● రాత్రంతా గాలులు, ఎడతెరిపి లేని వర్షం



పొన్నూరు: చింతలపూడి-వడ్డిముక్కల రహదారిలో కూలిన తాటి చెట్టు

తెనాలి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో నియోజకవర్గంలో జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. తుఫాన్ దాటికి తెనాలి పట్టణంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మంగళవారం రాత్రంతా పెను గాలులు వీయడంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. నరసాపురం వద్ద తీరం దాటిన తుఫాన్ ప్రభావం బుధవారం తెనాలి ప్రాంతంలో కనిపించలేదు. ఉదయం చిరుజల్లులు పడ్డా ఎండ రావడంతో జనం ఊరట చెందారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇళ్లపై, రహదారులపై చెట్లు పడి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలులు వీచినప్పటికీ పట్టణంలో చాలా ప్రాంతాల్లో రాత్రంతా విద్యుత్ సరఫరా కావడం విశేషం. రూరల్ మండల గ్రామాల్లో పలు మార్గాల్లో విద్యుత్ స్తంభాలు నేలకు ఒరగగా గంటల తరబడి విద్యుత్ నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించి ఒరిగిపోయిన స్తంభాలను నిలబెట్టించి కొమ్మలను, చెట్లను తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పట్టణంలోని పలు పల్లపు ప్రాంతాల్లో నిలిచిన నీటిని ఇంజన్లతో తోడించారు. కఠెవరం రైల్వే ట్రాక్ వెంట ఖాళీ స్థలంలో పెద్దఎత్తున నీరు నిలబడిపోయింది. పట్టణంలో 10 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 500 మందికి భోజన వసతి, అల్పాహారం అందించారు. బుధవారం మధ్యాహ్నం వాతావరణం బాగుండటంతో కేంద్రాలలో ఉన్న వారంతా ఖాళీ చేశారు. పట్టణంలో రెండు పూటల తాగునీరు అందించగా విద్యుత్ కొరత కారణంగా ఆలపాటినగర్‌లో సాయంత్రం తాగునీటి పంపిణీ జరిగింది. జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ పట్టణంలోని పునరావాస కేంద్రాలతో పాటు రూరల్ మండలంలోని కొలకలూరు, నందివెలుగులో పునరావాస కేంద్రాలను సందర్శించి ప్రజలకు ఆరోగ్య సూచనలు చేశారు. ప్రభాకర రెడ్డి, ఉమాకాంత్, పున్నారెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు, ఎంఈ శ్రీకాంత్, హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసు బాబు పర్యటించి తుఫాన్ పునరావాస పనులను పర్యవేక్షించారు. రూరల్ మండల గ్రామాల్లో సాగులో ఉన్న వరి పైరు నేలకొరిగింది. బీజేపీ నాయకులు తేలప్రోలు, కంచర్లపాలెం గ్రామాల్లో పొలాలను పరిశీలించి రైతులను పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవనాయుడు, కడియాల నందకిషోర్, వీరయ్య, రైతులను పరామర్శించారు.

చేబ్రోలులో అత్యధిక వర్షపాతం

తెనాలి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దాటికి తెనాలి డివిజన్‌లోని చేబ్రోలులో 85.4 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది. దుగ్గిరాలలో 67.8 మి.మీ, తాడేపల్లి 59.8 మి.మీ, కొల్లిపర 59 మీ.మీ, తెనాలి 54.9 మి.మీ, పొన్నూరు 54.8 మి.మీ, మంగళగిరి 47 మి.మీ వర్షపాతం నమోదైంది.

● పొన్నూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు ఏకధాటిగా వర్షం కురువడంతో పాటు ఈదురు గాలులు వీచాయి. మండల పరిధిలోని మామిళ్ళపల్లి చింతలపూడి, దొప్పలపూడి, పచ్చలతాడిపర్రు వంటి గ్రామాల్లో భారీ వృక్షాలు కూలిపోయాయి. చింతలపూడి గ్రామంలో వడ్డిముక్కల గ్రామానికి వెళ్లే రహదారిపై విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండలంలో పలు రహదారులపై వర్షపు నీరు చేరి ప్రజలు వాననీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికార



కొల్లిపర మండలం హనుమాన్‌పాలెం సమీపంలో గాలికి పూర్తిగా పడిపోయిన అరటి తోట



కొల్లిపర మండలం మున్నంగిలో నీటమునిగిన మినుము పంట



నంబూరు గ్రామంలో విరిగిపడిన చెట్టు కొమ్మలు



పొన్నూరు: భారీ వర్షాలకు కసుకర్రు గ్రామంలో నిమ్మ తోటలో నిలిచిన వర్షపు నీరు

యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి తుపాను సహాయక చర్యలు చేపట్టడంతో బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రజా జీవనం యధావిధిగా సాగింది.

● పొన్నూరు మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు వీచిన ఈదురు గాలులు ప్రభావంతో మండలంలో వాణిజ్య పంటలతో పాటు వరి పంట దెబ్బతింది. మండలంలో వాణిజ్య పంటలైన అరటి, తమలపాకు తోటలు ఈదురు గాలులకు నేలకు వరిగాయి. మండలంలో చింతలపూడి, కసుకర్రు, అరమండ, దండమూడి, మామిళ్ళపల్లి, పచ్చలతాడిపర్రు వంటి గ్రామాలలో వరి పైరు నేల వాలింది. కీలక దశలో వెన్ను విరిగి నేలకు వాలితే పైరు కాపాడుకునే అవకాశం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది పొలాల్లో గింజ పాలు పోసుకునే దశలో



మంచాలలో విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న జనసేన కార్యకర్తలు

ఉన్న వరి పైరు పూర్తిగా నేలవాలి నీటిలో నానుతోంది. ఈ ఏడాది మండలంలో 30 వేల ఎకరాలకు పైగా వరి సాగును చేపట్టారు. పొన్నూరు మండలంలో 4818 హెక్టార్లలో, చేబ్రోలు మండలంలో 2315 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారుల అంచనా. ప్రభుత్వం రైతులను ఆదుకొని త్వరితగతిన నష్టపరిహారం మంజూరు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

● కొల్లిపర: మొంథా తుఫాన్ ప్రభావంతో బుధవారం మధ్యాహ్నం వరకు ఈదురు గాలులతో ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. వర్షంతో పాటు 60 నుంచి 80 కిలో మీటర్ల వేగంతో వీచిన గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో భారీ వృక్షాలు నేలవాలాయి. పలుచోట్ల విద్యుత్ తీగలపై చెట్లు పడటంతో బుధవారం రాత్రి వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్‌ఐ కోటేశ్వరరావు, విద్యుత్ అధికారులు గ్రామాల్లో రోడ్లమీద పడిపోయిన చెట్లను యుద్ధప్రాతికన తొలిగింప చేశారు. ఈదురు గాలులు వీచడంతో అరటి, కంద పంటలతో పాటు వరి పంట కూడా పలుచోట్ల గాలికి పడిపోయాయి.

● చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు గ్రామ పరిసర ప్రాంతాల్లో దొండ పందిర్లు తుఫాన్ దాటికి నేలమట్టమయ్యాయి. కొన్ని చోట్ల సొరకాయ తోటలు పూర్తిగా నేలకొరిగాయి. ఒక్కో ఎకరానికి రూ.50 వేలవరకు ఖర్చుపెట్టి పంటను సాగుచేసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలు నీటమునిగిపోయాయి. పడిపోయిన వరి పంటను పైకి లేపి దుబ్బలు ముడివేయాలంటే కనీసం ఎకరానికి 20 నుండి 30 మంది కూలీలు అవసరం ఉందని, ఒక్క ఎకరానికి రూ. 10వేల పైనే ఖర్చవుతుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వరి పంట పొలాలు నీటిమయమైపోవడంతో రైతులు నీటిని బయటకు పంపించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

● చేబ్రోలు మండలంలోని మంచాల, పాతరెడ్డిపాలెం, నారాకోడూరు పరిధిలో అధికారులు, జనసేన కార్యకర్తలు రహదారులపై విరిగిపడిన చెట్లను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూశారు. తుఫాన్ ప్రభావంతో మండలంలోని అనేక గ్రామలలో చెట్లు విరిగిపడి రహదారులపై పడటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. చేబ్రోలు పరిధిలోని మంచాల గ్రామంలో రోడ్డుకు అడ్డంగా పెద్ద చెట్టు పడటంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని గమనించిన జనసేన మండలపార్టీ అధ్యక్షుడు చందు శ్రీరాములు ఆధ్వర్యంలో కార్యకర్తలు, గ్రామ సిబ్బంది చొరవతో చెట్లను నరికి రహదారి మార్గాన్ని సులభం చేశారు. అదేవిధంగా చేబ్రోలు పరిధిలోని పాతరెడ్డిపాలెంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఒక ఇల్లు కూలిపోయింది. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రాత్రి కురిసిన వర్షానికి నారాకోడూరు-తెనాలి ప్రధాన



చేబ్రోలు ప్రాంతంలో నీటమునిగిన వరిపైరు

రహదారిపై చెట్లు విరిగిపడి రవాణాకు అంతరాయం కలిగించాయి. అధికారులు స్పందించి చెట్లను తొలగించి రావపోకలను పునరుద్ధరించారు.

● పెదకాకాని: పెదకాకాని మండలంలో మూడు గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. కొప్పురావూరు, నంబూరు, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో రోడ్లపై విరిగిపడిన చెట్టుకొమ్మలను పంచాయతీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. మండల పరిధిలోని నాలుగు పునరావాస కేంద్రాలైన వెనిగండ్ల, నంబూరు, పెదకాకాని, ఉప్పలపాడు గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి నరసింహారావు, పెదకాకాని తహసీల్దార్ కృష్ణ కాంత్, ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావులు పరిశీలించి, పునరావస కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలను పర్యవేక్షించారు.

నిల్వ నీటిని బయటకు పంపండి: ఏవో



రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రియదర్శిని

చేబ్రోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపాలని మండల వ్యవసాయ అధికారి పి.ప్రియదర్శిని సూచించారు. బుధవారం మండల వ్యవసాయ అధికారి పి.ప్రియదర్శిని పంటలను పరిశీలించి రైతులతో సమావేశమై పంట సంరక్షణపై సూచనలు చేశారు. చేబ్రోలు మండలంలో అనేక గ్రామాల్లో వరి పంటలు నీటమునిగాయి. దాదాపు 2500 హెక్టార్లువరి నేల వాలింది. ఏవో మాట్లాడుతూ వాలిన వరిని దుబ్బులుగా కట్టి నిలబెట్టాలని రైతులకు సూచించారు. వేళ్ల బలహీనంగా ఉన్న మొక్కలకు మద్దతు ఇవ్వాలని, వేరుబంధం పునరుద్ధరించేందుకు జీవామృతం లేదా సూక్ష్మజీవ ద్రావణాలు వాడాలని సూచించారు. నీరు తగ్గిన తరువాత యూరియా, సూక్ష్మపోషకాలు స్ప్రే చేయడం ద్వారా పంటను తిరిగి కాపాడుకోవచ్చన్నారు. అధిక తేమవల్ల అగ్గితెగులు, పాముపొడ తెగులు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వెంటనే సరైన ఫంగిసైడ్‌లను వాడాలని రైతులకు సూచించారు. అదే విధంగా ఎలుకలు, కీటక నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రియదర్శిని తెలిపారు.చేబ్రోలు మండలంలో జరిగిన పంట నష్టంపై తొలిదశ నివేదిక ప్రకారం 2500హెక్టార్లలో వరి, మినుము పంటల వివరాలను ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పించినట్లు వెల్లడించారు.

తుపాను ప్రభావంపై ప్రత్యేకాధికారి సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి

పెదకాకాని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలంలో తుపాను ప్రభావం వలన జరిగిన నష్టాన్ని తెలుసుకునేందుకు మండల అధికారులతో బుధవారం పొన్నూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి సమీక్షించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో ఉన్న ప్రతి కుటుంబంలో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున 3000 రూపాయలు అందిస్తారని, అదేవిధంగా 25 కేజీల బియ్యం, పప్పులు అందిస్తారని తెలిపారు. పంట నష్టం వివరాలను అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావం వలన ఎటువంటి నష్టం జరగకుండా మండల స్థాయి అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం: ఆరేటి

పొన్నూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 31వ తేదీన ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జయప్రదం చేయాలని ఆ సంస్థ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో రామారావు మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31వ తేదీన స్వతంత్ర సమరయోధుడు లాలా లజపతిరాయ్ నాయకత్వంలో ఏఐటీయూసీ ఏర్పడిందన్నారు. 105 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సిద్ధమైందన్నారు. కార్యక్రమానికి నియోజకర్గంలోని కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ మెంబర్ గుంటూరు ఏడుకొండలు, మిక్కిలి జాన్, బత్తిన శ్రీనివాసరావు, గుమ్మడి రోశయ్య, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

కొల్లిపర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని తూములూరులో బుధవారం జరిగింది. తూములూరుకు చెందిన శ్రీనివాసరావు గ్రామంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో అతనికి బలమైన గాయాలు కావడంతో కుటుంబసభ్యులు కొల్లిపర ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తెనాలి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కూటమి పార్టీల సాయం

పొన్నూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను బాధితులకు కూటమి పార్టీల నాయకులు అండగా నిలిచారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బుధవారం పొన్నూరు పట్టణ మండలంలోని పునరావాస కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రాల్లో సేదతీరుతున్న బాధితులను పరామర్శించి వారికి అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. కూటమి పార్టీల నాయకులు, బాధితులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేయడమే కాకుండా ఆహార పదార్థాలు అందించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాలు అందజేత

తెనాలి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పట్టణంలో ఇబ్బందులు పడుతున్న పేదలకు బుధవారం దాతలు ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, టౌన్ చర్చి ప్రాంతాల్లో పేదలకు రావూరి అంజలి, సురేష్‌బాబులు అందజేశారు.

చేబ్రోలు వద్ద ఆటో బోల్తా

చేబ్రోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొమ్మమూరు కాలువ దగ్గర బుధవారం ఓ ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన గోపి మద్యంమత్తులో వాహనాన్ని నడుపుతున్నట్లు సమాచారం. తొట్టెంపూడి వద్ద ఒక ప్రమాదం జరిగాక కూడా వాహనాన్ని వేగంగా చేబ్రోలు వైపు నడుపుతూ వచ్చాడు. కొమ్మమూరు కాలువ వంతెన దిగువ రోడ్డు పక్కన ఉన్న మట్టిగుట్టను ఢీకొట్టి ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. అటుగా వెళుతున్న వారు వెంటనే స్పందించి గోపిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న చేబ్రోలు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

మొంథా తుఫాన్‌తో 4570 ఎకరాలలో పంట నష్టం

● ఏడీఏ విజయబాబు

తెనాలి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెనాలి, కొల్లిపర మండలాల్లో 4570 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లిందని, 14 గ్రామాల్లో 2752 హెక్టార్లలో పాక్షికంగా దెబ్బతిందని ఏడీఏ ఆర్.విజయబాబు, ఏవో సుధీర్ బాబు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, మినుము 51 హెక్టార్లు, అరటి 309 హెక్టార్లు, పసుపు 285 హెక్టార్లు, కంద 17 హెక్టార్లు, కూరగాయలు 10 హెక్టార్లులో దెబ్బతిందని చెప్పారు. వరి పైరు బ్రిరుపొట్ట దశలో, పాలు పోసుకునే గింజ గట్టిపడే దశలో ఉందని, బుధవారం వర్షం ఆగడంతో కొంత మేలు జరిగిందన్నారు. 25శాతం మేరకు పంట నష్టం వాటిల్లిందని, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. రైతులు పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు తరలించాలని, వర్షం వలన పాముపొడ తెగులు వచ్చే అవకాశం ఉందని యూరియా, పొటాష్ వేయాలని వ్యవసాయ అధికారులు సూచించారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు, తదితరులు

పేదలకు నిత్యావసరాల పంపిణీ

పొన్నూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూటమి ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ప్రజల ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా కాపాడగలిగామని డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు అన్నారు. మండల పరిధిలోని వడ్డిముక్కల గ్రామంలో బుధవారం డీసీఎంఎస్ చైర్మన్ పర్యటించి పంట దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిరుపేదలను పరామర్శించి బియ్యం కందిపప్పు వంటి నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు యన్నం నాయుడు, షేక్ సుభాని, టీడీపీ నాయకుడు తోట రాధాకృష్ణ, బిజేపి మండల అధ్యక్షుడు వడ్రాణం ఉదయ్, వడ్రాణం రాంబాబు, తన్నీరు సాంబశివరావు, స్టాలిన్, శీలం అశోక్, తదితరులు పాల్గొన్నారు.